



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 184 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : ఒంగోలు | మంగళవారం 10 మార్చి 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :184 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : ONGOLE | TUE 10 MARCH 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దుతున్నాం

- నంద్యాల జిల్లా కొత్త బురుజులో రైతులకు పట్టాదార్ పాస్‌పుస్తకాల పంపిణీ
- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ పేరుతో గత ప్రభుత్వం భూములు లాక్కునే ప్రయత్నం చేసిందన్న సీఎం
- రికార్డులు ట్యాంపరింగ్ కాకుండా క్యూఆర్ కోడ్, బ్లాక్ చైన్ టెక్నాలజీతో కొత్త పాస్‌పుస్తకాలు
- కేంద్ర సాయంతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని వెల్లడి
- గత ప్రభుత్వంలా విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపబోమని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం నంద్యాల జిల్లా కొత్త బురుజు గ్రామంలో రైతులకు కొత్త పట్టాదార్ పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులను కూటమి ప్రభుత్వం సరిదిద్దుతోందని స్పష్టం చేశారు. గత పాలకులు రెవెన్యూ వ్యవస్థను భ్రష్టు పట్టించారని, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ పేరుతో రైతులు, పేదల భూములను లాక్కునే ప్రయత్నం చేశారని ఆరోపించారు.రాజకీయ కక్ష సాధింపులు, అక్రమ ఆక్రమణల కోసమే గత ప్రభుత్వం 1.95 కోట్ల ఎకరాలను సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టిందని సీఎం మండిపడ్డారు. తాము అధికారంలోకి రాగానే ఆ చట్టాన్ని రద్దు చేసి, రికార్డుల్లోని తప్పులను సరిచేస్తున్నామని చెప్పారు. గత పాలకులు పాస్ పుస్తకాలపై, సర్వే రాళ్లపై తమ ఫోటోలు వేసుకుని రూ.750 కోట్లు వృథా చేశారన్నారు. రైతుల సమక్షంలోనే కొలతలు వేసి, వారి ఆమోదంతోనే ఎలాంటి అవినీతికి తావులేకుండా పారదర్శకంగా కొత్త పుస్తకాలు ఇస్తున్నట్లు వివరించారు. క్యూఆర్ కోడ్, బ్లాక్ చైన్ టెక్నాలజీని వినియోగిస్తున్నామని, దీనివల్ల రికార్డులను ఎవరూ ట్యాంపరింగ్ చేయలేరని, అధికారులు తప్పు చేసినా ఇట్టే తెలిసిపోతుందని పేర్కొన్నారు.రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని సీఎం పునరుద్ఘాటించారు. ఇందుకోసం పూర్వోదయ పథకం కింద కేంద్రం రూ.30 వేల కోట్లు ఇస్తుందని తెలిపారు. కర్నూలులో డ్రోన్ సిటీ, అనంతపురంలో ఏరోస్పేస్ సిటీ ఏర్పాటు చేస్తామన్నారు. గత ప్రభుత్వం ఎనిమిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై రూ.32 వేల కోట్ల భారం మోపిందని, కూటమి ప్రభుత్వం ఛార్జీలు పెంచబోదని హామీ ఇచ్చారు. అలాగే, తిరుపతి లడ్డూ వ్యవహారంపై ప్రతిపక్షం తప్పుడు ప్రచారం చేస్తోందని, శ్రీవారి పవిత్రతను దెబ్బతీసే ఎలాంటి చర్యలనూ సహించేది లేదని చంద్రబాబు హెచ్చరించారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు.



## రేవేంద్రపాడులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి లోకేశ్

- మంత్రి నారా లోకేశ్ ఘనస్వాగతం పలికిన స్థానికులు, టీడీపీ శ్రేణులు
- భారీ ర్యాలీ మధ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన విద్యా, ఐటీ శాఖల మంత్రి
- ఎన్టీఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు
- కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు

పెన్ పవర్ డెస్క్:మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల మండలం రేవేంద్రపాడులో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ నేడు లాంఛనంగా ఆవిష్కరించారు. ఇవాళ రేవేంద్రపాడు చేరుకున్న మంత్రి లోకేశ్ కు స్థానిక ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మధ్య ఉత్సాహభరిత వాతావరణంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ జరిగింది. విగ్రహావిష్కరణ తరువాత అక్కడ ఉన్న ఎన్టీఆర్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు లోకేశ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమానికి వచ్చిన అభిమానులు, కార్యకర్తలతో

మిగతా 2లో



## అవి ప్రభుత్వ హత్యలే

- రాజమండ్రి కల్తీ పాల ఘటనలో 11 మంది మృతి
- ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యమే కారణమని షర్మిల తీవ్ర ఆరోపణ
- 11 ఏళ్లుగా లైసెన్స్ లేకుండానే వ్యాపారం జరిగిందని విమర్శ
- మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్
- బాధితులను పరామర్శించని జగన్‌పై కూడా విమర్శలు

మిగతా 2లో



## జమిలి ఎన్నికల వల్ల రాష్ట్ర ఎన్నికల ప్రాధాన్యత తగ్గుతుంది

- కేంద్ర ప్రభుత్వం చేతుల్లోకి అధికారాలన్నీ వెళతాయన్న స్టాలిన్
- అసలు సమస్య కంటే దారుణమైన పరిణామాలకు దారితీస్తుందని ఆందోళన
- జమిలి ఎన్నికలతో జాతీయస్థాయి పార్టీలకే ప్రయోజనమని ఆందోళన

మిగతా 2లో

## అమరావతిలో టీటీడీ ఆలయం కోసం రూ. 12.5 కోట్లు పెట్టి భూమి కొనడం ఏమిటి?

- అమరావతి వెంకటాయపాలెంలో శ్రీవారి ఆలయ నిర్మాణం
- సాధారణంగా ఆలయాల నిర్మాణానికి భక్తులు లేదా సంస్థలు ఉచితంగా భూములు ఇస్తారన్న భూమన
- భక్తుల సొమ్మును టీటీడీ దుర్వినియోగం చేసిందని విమర్శ

మిగతా 2లో





## వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో చెత్త సమస్య తీవ్ర రూపం దాల్చింది

పెన్ పవర్ డెస్క్:గత వైసీపీ ప్రభుత్వంపై ఏపీ మంత్రి నారాయణ విమర్శనాస్త్రాలు సంధించారు. జగన్ ఐదేళ్ల పాలనను 'చెత్త పాలన'గా అభివర్ణిస్తూ, ఆ సమయంలో పేరుకుపోయిన వ్యర్థాల సమస్య రాష్ట్రానికి పెను సవాలుగా మారిందని ఆయన మండిపడ్డారు. వైసీపీ హయాంలో పట్టణాల్లో పారిశుద్ధ్యం పడకేయడం వల్లే నేడు భారీస్థాయిలో చెత్త నిల్వలు పేరుకుపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ద రాష్ట్రవ్యాప్తంగా సుమారు

మిగతా 2లో



## ఏపీ మద్యం కుంభకోణం కేసు.. ఈడీ దర్యాప్తు ముమ్మరం


- ఈడీ విచారణకు హాజరైన ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, వెంకటేశ్ నాయుడు, చాణక్య
- రెండు గంటల విచారణ తర్వాత వెళ్లిపోయిన ధనుంజయరెడ్డి
- నగదు రూపంలో లావాదేవీలపై ఈడీ అధికారుల ప్రశ్నలు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో విచారణను ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముమ్మరం చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న కె.ధనుంజయరెడ్డి , కృష్ణమోహన్‌రెడ్డి, వెంకటేశ్ నాయుడు, చాణక్య

మిగతా 2లో

## ఇరాన్‌కు రష్యా పూర్తి అండగా ఉంటుంది


- పశ్చిమాసియాలో గరిష్ఠ స్థాయికి చేరిన ఉద్రిక్తతలు
- ఇరాన్‌కు వ్యూహాత్మక మద్దతును ప్రకటించిన పుతిన్
- ఇరాన్ నేతల మృతి పట్ల తీవ్ర సంతాపం



పెన్ పవర్ డెస్క్: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరిన వేళ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇరాన్‌కు తన మద్దతును ప్రకటించారు. ఇజ్రాయెల్, అమెరికాలతో సాగుతున్న ఘర్షణల్లో మిత్రదేశమైన ఇరాన్‌కు మాస్కో అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన ముజ్తబా ఖమేనీకి పుతిన్ అభినందనలు తెలుపుతూ, ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో దేశాన్ని సమర్థవంతంగా నడిపించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. సరిహద్దుల్లో ఎదురవుతున్న సాయుధ

మిగతా 2లో

## రాజ్యసభ సభ్యులుగా వేం నరేందర్ రెడ్డి, అభిషేక్ సింఘ్వీ ఏకగ్రీవం



- రాజ్యసభ సభ్యులుగా తెలంగాణ నుంచి ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి, అభిషేక్ సింఘ్వీ
- ఇద్దరికీ ధృవపత్రాలు అందించిన రిటర్నింగ్ అధికారి
- సమస్యలను పరిష్కరించి కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తామన్న వేం నరేందర్ రెడ్డి

పెన్ పవర్ డెస్క్:తెలంగాణ సమస్యలను రాజ్యసభలో, ఢిల్లీలో వినిపిస్తానని రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ తరపున రాజ్యసభ సభ్యులుగా అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇద్దరికీ రిటర్నింగ్ అధికారి ధృవపత్రాలను

మిగతా 2లో

## ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు ఢిల్లీ సేఫ్ కాదు బీజేపీ ఎంపీ సంచలన వ్యాఖ్యలు

- జాతి వివక్ష, దాడుల ఘటనల పట్ల ఆందోళన వ్యక్తం చేసిన ఎంపీ
- బలమైన, చట్టపరమైన చట్రాలు అవసరమన్న బీజేపీ ఎంపీ
- అట్రాసిటీ లాంటి చట్టాన్ని తీసుకురావాలని విజ్ఞప్తి

పెన్ పవర్ డెస్క్:అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎంపీ తపిర్ గావో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలోని ఈశాన్య రాష్ట్రాల ప్రజల భద్రతపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తమ ప్రజలకు ఢిల్లీ సురక్షితం కాదని ఆయన అన్నారు. దేశ రాజధానిలో జాతి వివక్ష, దాడుల సంఘటనలు ఆందోళనకరమని పేర్కొన్నారు.

మిగతా 2లో



## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సైబర్ క్రైమ్ ఎస్సైలు

- రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన ఎల్బీనగర్ సైబర్‌క్రైమ్ ఎస్సైలు
- ఒక కేసు విషయంలో లక్ష రూపాయల లంచం డిమాండ్ చేసిన వైనం
- ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# ప్రమాదపుటంచున ప్రజారోగ్యం

ఆహార భద్రత ఏ ప్రభుత్వానికైనా అత్యంత ప్రాథమిక బాధ్యతల్లో ఒకటి. ప్రజలు తాగే పాలు, తినే తిండి భద్రంగా ఉన్నాయా అనే విషయంలో నమ్మకం లేకపోతే, పాలనపట్ల తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతాయి. భారతదేశంలో తరచుగా వెలుగులోకి వస్తున్న పాలకల్తీ ఘటనలు, అలాగే నిద్రపోతున్న నియంత్రణ వ్యవస్థ, అమలు కాని ఆహార భద్రత చట్టాలు, ఆహార భద్రతను నిర్ధారించాల్సిన వ్యవస్థ ఇంకా సరైన స్థాయిలో పనిచేయడం లేదని స్పష్టంగా చూపిస్తున్నాయి. ఒకే వ్యాపారి సరఫరా చేసిన కల్తీ పాలు తాగినందున వందకుపైగా కుటుంబాలు ప్రభావితమయ్యాయి. తొమ్మిది మంది తీవ్రమైన మూత్రపిండ వైఫల్యంతో ప్రాణాలు కోల్పోయారు. చిన్నపిల్లలు సహా పలువురు ఇంకా పదుల సంఖ్యలో వెంటిలేటర్‌పై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ దుర్ఘటన తర్వాత కూడా కల్తీ పదార్థాన్ని గుర్తించడానికి రాష్ట్రం వెలుపల ఉన్న ప్రయోగశాలల నివేదికలు రావాల్సి వచ్చింది. స్థానిక స్థాయిలో తక్షణంగా పరీక్షించే సామర్థ్యం లేకపోవడంవల్ల, ప్రమాదాన్ని ముందుగానే అరికట్టాల్సిన వ్యవస్థ ప్రాణనష్టాల తర్వాత మాత్రమే స్పందించింది. ఇలాంటి సమయంలో ఆహార భద్రత మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రాధాన్యంగా ఉండాలి. అయితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రస్తుతం డ్రాఫ్ట్ పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీపై దృష్టి సారించింది. పోషణ –శిక్ష సురక్ష ప్యాకేజ్‌ద్వారా రాష్ట్రంలో మొత్తం ఫెర్టిలిటీ రేటును 1.5 నుంచి 2.1కు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. మూడో బిడ్డకు ప్రోత్సాహకరంగా ప్రసవ సమయంలో రూ. 25,000, ఐదేళ్లపాటు ప్రతి నెల రూ. 1,000 ఆర్థిక సహాయం, 18 ఏళ్ల వరకు ఉచిత విద్య ఇవ్వాలని ప్రతిపాదించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో ఈ విధానాన్ని ప్రవేశపెడుతూ, జననాల రేటు తగ్గిపోతే జపాన్, ఇటలీ, దక్షిణకొరియా వంటి దేశాల్లో ఎదురైన జనాభా సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీర్ఘకాలిక జనాభా ప్రణాళిక అవసరమే అయినప్పటికీ, పాలకల్తీ వంటి తక్షణ ప్రజాఆరోగ్య సమస్యలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని విమర్శకులు అంటున్నారు.

దేశవ్యాప్తంగా కూడా పాలనాణ్యతపై ఆందోళన కలిగించే విషయాలు బయటపడుతున్నాయి. భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ నిర్వహించిన సర్వేలు, పెద్ద సంఖ్యలో పాల నమూనాలు నాణ్యత ప్రమాణాలను తీరకపోవడం చూపిస్తున్నాయి. పాలలో నీరు కలపడం అత్యంత సాధారణమైన కల్తీ విధానం. దీనివల్ల పాలపోషక విలువ తగ్గిపోవడమే కాకుండా, కలుషిత నీరు వాడితే పురుగుమందులు, భారీ లోహాలు వంటి హానికర పదార్థాలు కూడా చేరే ప్రమాదం ఉంది. కొన్ని నమూనాల్లో డిటర్జెంట్లు, యూరియా, స్టార్చ్, గ్లూకోజ్, ఫార్మలిన్ వంటి పదార్థాలు కూడా కనిపించాయి. ఇవి పాల మందాన్ని పెంచడానికి లేదా నిల్వకాలాన్ని పెంచడానికి ఉపయోగిస్తారు. అయితే ఇవి ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదాన్ని కలిగిస్తాయి. వైద్య పరిశోధనలు చూపుతున్నట్లుగా, ఇటువంటి కల్తీ పదార్థాలు జీర్ణాశయ సమస్యలు, ఆహార విషబాధ, అవయవాల నష్టం, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు కారణమవుతాయి. మునుపటి సర్వేలు పరీక్షించిన నమూనాల్లో దాదాపు 70 శాతం నాణ్యత ప్రమాణాలను తీరలేదని సూచించాయి. అయితే అన్ని నమూనాలు ప్రమాదకరంగా ఉండేవి కావు.

ఎఫ్ఎస్ఎస్ఎఐ నిర్వహించిన సమగ్ర జాతీయ సర్వేలో దేశవ్యాప్తంగా 6,432 నమూనాలను పరీక్షించారు. వాటిలో కొద్దిపాటి నమూనాల్లో మాత్రమే హైడ్రోజన్ పెరాక్సైడ్, డిటర్జెంట్లు, యూరియా వంటి ప్రమాదకర కల్తీలు కనిపించాయి. కానీ దాదాపు 41 శాతం నమూనాలు కొవ్వు, సాలిడ్ నాట్ ఫ్యాట్ వంటి ముఖ్య నాణ్యత ప్రమాణాలను తీరలేదని వెల్లడైంది. ఈ సర్వేలో 5.7 శాతం నమూనాల్లో అఫ్లాటాక్సిన్ ఎం1 అవశేషాలు కనిపించాయి. ఇది పశువులకు ఇచ్చే ఆహారంలో కలుషితం కారణంగా పాలలో చేరుతాయి. ఇది డెయిరీ వ్యవసాయం, సరఫరా నిర్వహణలో ఉన్న సమస్యలను సూచిస్తుంది. ఈ వివరాలు పాల భద్రత, పాల నాణ్యత మధ్య ఉన్న ముఖ్యమైన తేడాను చూపిస్తున్నాయి. భద్రత నాణ్యతను నిర్ధారించడం కేవలం నియంత్రణ సమస్య కాదు, అది కీలకమైన ప్రజాఆరోగ్య బాధ్యత. ప్రభుత్వాలు ఆహార పరీక్షా ప్రయోగశాలలను బలోపేతం చేయాలి, తగిన సంఖ్యలో నిపుణులను నియమించాలి, డెయిరీ సరఫరా వ్యవస్థపై కఠిన పర్యవేక్షణ అమలు చేయాలి. ఈ చర్యలు తీసుకోకపోతే, ప్రతి రోజు కోట్లాది వినియోగదారుల మనసులో ఒక ప్రశ్న మిగిలిపోతూనే ఉంటుంది. మనము తాగే పాలు నిజంగా భద్రమేనా?

# ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు ఢిల్లీ సేఫ్ కాదు
# బీజేపీ ఎంపీ సంచలన వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

ఈ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతానని అన్నారు. ఈశాన్య ప్రాంతానికి చెందిన ప్రజల రక్షణకు బలమైన చట్టపరమైన చట్రాలు అవసరమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంతోపాటు బీజేపీ ప్రభుత్వం ఉన్న దేశ రాజధానిలో ఈశాన్య ప్రజలపై జరుగుతున్న దాడుల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈశాన్య రాష్ట్రాల ప్రజలపై జాతి వివక్షత చూపడంతోపాటు దాడులు జరుగుతున్నాయని అన్నారు. ఢిల్లీలోనే కాదు, దేశవ్యాప్తంగా ఉన్న అన్ని మెట్రోపాలిటన్ నగరాల్లో కూడా ఈశాన్య ప్రాంతాల ప్రజలు జాతి వివక్ష, దాడులు, హత్యలను ఎదుర్కొంటున్నారని వాపోయారు. కేంద్ర హోంమంత్రిని కలిసి అట్రాసిటీ లాంటి చట్టాన్ని తీసుకురావాలని కోరతామని తపిర్ గావో అన్నారు.

# అవి ప్రభుత్వ హత్యలే

రాజమండ్రిలో కల్తీ పాలు తాగి 11 మంది మరణించడంపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా స్పందించారు. ఈ మరణాలను ప్రభుత్వ హత్యలుగా అభివర్ణించిన ఆమె, రాష్ట్ర ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యం, ఆహార భద్రతా వైఫల్యమే ఈ ఘోరానికి కారణమని ఆరోపించారు.

నేడు రాజమండ్రిలోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఇది ప్రమాదం కాదని, అధికారుల ఉదాసీనత వల్లే జరిగిందని అన్నారు. వరలక్ష్మి అనే పాల వ్యాపారి దాదాపు 11 ఏళ్లుగా ఎలాంటి లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్నా, ఫుడ్ సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమని విమర్శించారు. అధికారులకు తెలియకుండా ఇన్నేళ్లుగా అక్రమ వ్యాపారం ఎలా సాధ్యమైందని ఆమె ప్రశ్నించారు. ఇథిలీన్ గ్లైకాల్ కలిపిన పాలు తాగడం వల్లే పలువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారని, కొందరు వెంటిలేటర్‌పై ప్రాణాలతో పోరాడుతున్నారని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పాలు, నెయ్యి, మద్యం, తాగునీరు సహా అన్ని నిత్యావసరాలు కల్తీమయం అవుతున్నా, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాజమండ్రి వంటి నగరానికి ఒక్కరే ఫుడ్ సేఫ్టీ అధికారి ఉండటం, ఆయన కూడా స్థానికంగా అందుబాటులో లేకపోవడం సిబ్బంది కొరతకు నిదర్శనమన్నారు. ఈ ఘటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నైతిక, పరిపాలనా బాధ్యత వహించాలని షర్మిల డిమాండ్ చేశారు. ఫుడ్ సేఫ్టీ విభాగంలో వెంటనే భారీగా నియామకాలు చేపట్టి, కఠిన తనిఖీలు నిర్వహించాలన్నారు. మృతుల కుటుంబాలకు ప్రకటించిన రూ. 10 లక్షల పరిహారాన్ని రూ. 25 లక్షలకు పెంచాలని కోరారు. బాధితులను మాజీ ముఖ్యమంత్రి జగన్ ఇప్పటివరకు పరామర్శించకపోవడం సరికాదని అన్నారు. సామాన్య ప్రజల పట్ల ఆయన వైఖరి ఏంటో దీని ద్వారా తెలుస్తోందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని ఆహార భద్రతా నిబంధనలను కఠినంగా అమలు చేయకపోతే ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం అవుతాయని హెచ్చరించారు.

## జమిలి ఎన్నికల వల్ల రాష్ట్ర ఎన్నికల ప్రాధాన్యత తగ్గుతుంది

వన్ నేషన్ వన్ ఎలక్షన్ (జమిలి ఎన్నికలు) వల్ల రాష్ట్ర ఎన్నికల ప్రాధాన్యత తగ్గిపోతుందని, కేంద్ర ప్రభుత్వం చేతుల్లోకి అధికారాలన్నీ వెళతాయని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మండిపడ్డారు. జమిలి ఎన్నికల విధానంపై ఆయన స్పందిస్తూ, ఈ విధానం దేశానికి ఒక పరిష్కారం చూపిస్తుందేమో కానీ, అసలు సమస్య కంటే దారుణమైన పరిణామాలకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. లోక్ సభకు, రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు జరపడమంటే భారతదేశ సమాఖ్య నిర్మాణం, ప్రజాస్వామ్య వైవిధ్యం దెబ్బతింటుందని అన్నారు. రాష్ట్రాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు కాలరాసినట్లవుతుందని విమర్శించారు. జమిలి ఎన్నికలు జరిగితే జాతీయ స్థాయి పార్టీలకే ప్రయోజనం చేకూరుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాంతీయ సమస్యలు, ప్రజల మనోభావాలు పక్కకు వెళతాయని అన్నారు. కేవలం ఖర్చు తగ్గుతుందనే కారణంతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయకూడదని అన్నారు.

# వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో చెత్త సమస్య తీవ్ర రూపం దాల్చింది

- మొదటి పేజి తరువాయి

కోటి 53 లక్షల టన్నుల చెత్త నిల్వలు పేరుకుపోయాయని గుర్తించినట్లు మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు యుద్ధ ప్రాతిపదికన పారిశుద్ధ్య పనులు చేపట్టి, ఇప్పటివరకు కోటి 15 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేశామని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే పది 'వేస్ట్ టు ఎనర్జీ' (చెత్త నుంచి విద్యుత్) ప్లాంట్లు ప్రారంభించామని, వాటిలో రెండు పూర్తి చేశామని గుర్తుచేశారు. జగన్ ప్రభుత్వం ఆ ప్లాంట్లను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం వల్లే నేడు రాష్ట్రంలో చెత్త సమస్య ఇంత తీవ్రరూపం దాల్చిందని ఆయన ధ్వజమెత్తారు.

భవిష్యత్తులో ఈ సమస్య తలెత్తకుండా ప్రధాన నగరాల్లో పీపీపీ పద్ధతిలో అత్యాధునిక వేస్ట్ ఎనర్జీ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని నారాయణ పేర్కొన్నారు. వ్యర్థాల నిర్వహణలో శాస్త్రీయ పద్ధతులను

అనుసరిస్తూ రాష్ట్రాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లా అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించిన ఆయన, పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, తాగునీటి ప్రాజెక్టులను త్వరలోనే పూర్తి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన సైబర్ క్రైమ్ ఎస్సైలు

ఎల్బీనగర్ సైబర్‌క్రైమ్ పోలీస్ స్టేషన్ కు చెందిన ఇద్దరు ఎస్సైలు ఏసీబీకి అడ్డంగా దొరికిపోయారు. ఒక కేసులో నిందితుడికి 41 నోటీసులు ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసి ఏసీబీ అధికారులకు చిక్కారు. వివరాల్లోకి వెళితే... ఎల్బీనగర్ సైబర్‌క్రైమ్ విభాగంలో పనిచేస్తున్న ఎస్ఐ బాబునాయక్, ఎస్ఐ ప్రమోద్ ఒక కేసు విషయంలో నిందితుడిని ఇబ్బంది పెట్టకుండా ఉండేందుకు, నోటీసులు ఇచ్చే ప్రక్రియను పూర్తి చేసేందుకు లక్ష రూపాయలను లంచంగా డిమాండ్ చేశారు. దీనిపై బాధితుడు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించడంతో వారు పక్కా ప్లాన్ వేశారు. ఫిర్యాదుదారు నుంచి ఆ లక్ష రూపాయల నగదును ఎస్ఐలు తీసుకుంటుండగా, మాటు వేసిన ఏసీబీ అధికారులు వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఎల్బీనగర్ సైబర్‌క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ బృందాలు విస్తృతంగా సోదాలు నిర్వహించాయి.

# అమరావతిలో టీటీడీ ఆలయం కోసం రూ. 12.5 కోట్లు పెట్టి భూమి కొనడం ఏమిటి?

ముఖ్యమంత్రి చంద్రబాబు, టీటీడీ ప్రస్తుత పాలకమండలిపై టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అమరావతిలోని వెంకటాయపాలెంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి సంబంధించి టీటీడీ తీసుకున్న నిర్ణయాలను ఆయన తప్పుబట్టారు.

శ్రీవారిని కూడా రాజకీయ అవసరాలకు వాడుకునేలా చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని భూమన ఆరోపించారు. సాధారణంగా దేవుడి ఆలయాల నిర్మాణానికి భక్తులు లేదా సంస్థలు ఉచితంగా భూములు ఇస్తాయని, కానీ అమరావతిలో టీటీడీ ఆలయం కోసం రూ. 12.5 కోట్లు వెచ్చించి భూమిని కొనడం ఏంటని ఆయన ప్రశ్నించారు. టీటీడీ చరిత్రలో ఎప్పుడూ ఆలయాల కోసం భూమిని కొనుగోలు చేసిన దాఖలాలు లేవని, ఇది భక్తుల సొమ్మును దుర్వినియోగం చేయడమేనని మండిపడ్డారు. వివిధ ప్రైవేట్ సంస్థలకు ఉచితంగా భూములు కేటాయిస్తున్న ప్రభుత్వం, దేవుడికి మాత్రం భూమిని అమ్ముతోందని విమర్శించారు. టీటీడీ చెల్లించిన రూ. 12.5 కోట్ల సొమ్మును సీఆర్డీఏ వెంటనే వెనక్కి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

మరోవైపు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిపై వస్తున్న వ్యక్తిగత ఆరోపణలపైనా భూమన స్పందించారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి పవిత్రమైన టీటీడీ చైర్మన్ పదవిలో ఉండటం సరికాదని, ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల తిరుమలలో నెయ్యి ట్యాంకర్ బోల్తా పడటం వంటి ఘటనలు స్వామివారు ఆగ్రహించడమేనని ఆయన వ్యాఖ్యానించారు. తిరుమల పవిత్రతను కాపాడటంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని భూమన కరుణాకర్ రెడ్డి ధ్వజమెత్తారు.

## రేవేంద్రపాడులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి లోకేశ్

- మొదటి పేజి తరువాయి

ఆయన కాసేపు ముచ్చటించి, వారితో కలిసి ఫోటోలు దిగారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, దుగ్గిరాల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కాసరనేని జశ్వంత్, దుగ్గిరాల మండల టీడీపీ అధ్యక్షురాలు కేశినేని శ్రీఅనిత తదితరులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, స్థానికులు తరలిరావడంతో రేవేంద్రపాడులో కోలాహలం నెలకొంది.

## ఇరాన్‌కు రష్యా పూర్తి అండగా ఉంటుంది

- మొదటి పేజి తరువాయి

దురాక్రమ ణను తిప్పికొట్టడంలో ఇరాన్‌కు ముజ్తబా నాయకత్వం అవసరమని పుతిన్ పేర్కొన్నారు. ఇటీవల ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఖమేనీ సహా ఇతర అగ్రనేతల మృతిపై ఆయన తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ఆంక్షలు, యుద్ధ మేఘాల మధ్య రష్యా–ఇరాన్‌ల మధ్య బలపడుతున్న ఈ వ్యూహాత్మక బంధం పశ్చిమాసియా రాజకీయ సమీకరణాలను వేగంగా మారుస్తోంది. రష్యా ఇస్తున్న ఈ బహిరంగ హామీ ఇరాన్‌కు అంతర్జాతీయ స్థాయిలో భారీ నైతిక బలాన్ని చేకూర్చనుంది.

## ఏపీ మద్యం కుంభకోణం కేసు.. ఈడీ దర్యాప్తు ముమ్మరం

- మొదటి పేజి తరువాయి

ఈడీ విచారణకు హాజరయ్యారు. రెండు గంటల విచారణ తర్వాత కృష్ణమోహన్‌రెడ్డి వెళ్లిపోగా... ఇతర నిందితులను అధికారులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం పాలసీని ఎలా రూపొందించారు? కేవలం నగదు రూపంలోనే లావాదేవీలు ఎందుకు నిర్వహించారు? అనే అంశాలపై ఈడీ అధికారులు ఆరా తీశారు. ముఖ్యంగా పాప్యులర్ బ్రాండ్లను కాదని, కొత్త బ్రాండ్లకు అనుమతులు ఇవ్వడం వెనుక ఉన్న కారణాలపై సమాచారాన్ని రాబట్టేందుకు ఈడీ అధికారులు ప్రయత్నించారు.. ఈ కుంభకోణం వల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 4,000 కోట్ల నష్టం వాటిల్లిందని ఈడీ ప్రాథమికంగా అంచనా వేసింది. అక్రమ సొమ్మును షెల్ కంపెనీల ద్వారా మళ్లించి, తిరిగి నిందితుల ఖాతాల్లోకి చేరేలా ప్రణాళిక రచించినట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికే ఈ కేసులో నిందితులైన రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డి, చాణక్యలకు చెందిన రూ. 441 కోట్లకు పైగా విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది.

## రాజ్యసభ సభ్యులుగా వేం నరేందర్ రెడ్డి, అభిషేక్ సింఘ్వీ ఏకగ్రీవం

- మొదటి పేజి తరువాయి

అందించారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించిన ఏఐసీసీ పెద్దలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ సమస్యలను రాజ్యసభలో, ఢిల్లీలో వినిపించి వాటిని పరిష్కరించే విధంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తానని అన్నారు.

## రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు... సునీల్ నాయక్ విచారణ పొడిగింపు



ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఐపీఎస్ అధికారి ఎం. సునీల్ నాయక్ ఐదో రోజు విచారణ ముగిసింది. గుంటూరులోని సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో విచారణ అధికారి, విజయనగరం ఎస్పీ దామోదర్ ఆయనను ప్రశ్నించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు.. దాదాపు ఏడు గంటల పాటు ఈ విచారణ కొనసాగింది. సీసీఎస్ స్టేషన్‌కు తరలించడానికి ముందు, సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో రఘురామ కస్టోడియల్ టార్చర్ ఘటనకు సంబంధించి పోలీసులు సీన్ రీక్రియేషన్ చేసినట్లు సమాచారం. గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు మార్చి 5 నుంచి 9వ తేదీ వరకు ఐదు రోజుల పాటు సునీల్ నాయక్ పోలీసుల విచారణకు హాజరయ్యారు. సోమవారంతో ఈ విచారణ ముగుస్తుందని అంతా భావించారు. అయితే, సునీల్ నాయక్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో సోమవారం విచారణ జరిగింది. ప్రభుత్వం తరపు న్యాయవాదులు తమ వాదనలు వినిపించగా.. సునీల్ నాయక్ తరపు న్యాయవాదులకు వాదనలు వినిపించేందుకు న్యాయస్థానం మార్చి 12 వరకు అవకాశం కల్పించింది. విచారణ అధికారి కోరిక మేరకు, మార్చి 12 వరకు విచారణకు హాజరుకావాలని హైకోర్టు సునీల్ నాయక్‌ను ఆదేశించింది. దీంతో మరో మూడు రోజుల పాటు ఆయనను విచారించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. గత ప్రభుత్వ హయాంలో రఘురామకృష్ణరాజు సీఐడీ కస్టడీలో ఉన్నప్పుడు కాళ్లు వాచి, నడవలేని స్థితిలో కోర్టుకు హాజరైన ఘటన ఈ కేసుకు ప్రధాన కేంద్రం అన్న విషయం తెలిసిందే.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

## ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే ముత్తుముల

### ఆసుపత్రి నిర్మాణం పూర్తి - త్రాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు కోరిన ఎమ్మెల్యే



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 9**


గిద్దలూరు నియోజకవర్గం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మార్కాపురం జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు ను మర్యాదపూర్వకంగా కలిసి పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా గిద్దలూరు ప్రాంతంలో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయుటకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే రాబోయే వేసవి కాలంలో ఎండలు అధికమవనున్న నేపథ్యంలో ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు.ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, అవసరమైన చోట్ల నీటి వనరులను మెరుగుపరచి సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కలెక్టర్ .రాజబాబు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వెంటనే సమస్యల గురించి పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

## వసతి గృహాలలో చదివే విద్యార్థులే

# టాపర్లుగా నిలవాలి

### - మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి

### - వసతి గృహాలలో చదివే విద్యార్థులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్






**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 09**

రాష్ట్ర, జిల్లా స్థాయిలో టాపర్లు గా మన సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలలో చదివే విద్యార్థులే ఉండాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి స్వామి ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో చదివే విద్యార్థులతో ఆయన నాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ,విద్యార్థులలో పరీక్షల భయం పోగొట్టేలా గొప్ప ప్రేరణ కలిగేలా మాట్లాడారు. పరీక్షలంటే భయపడకూడదని, అవి విద్యార్థులలో ఉండే నైపుణ్యాన్ని వెలికి తీసే ప్రక్రియ అని విద్యార్థులకు చెప్పారు. త్వరలో జరగనున్న 10 వ తరగతి పబ్లిక్ పరీక్షలలో ప్రతి ఒక్క విద్యార్థి కచ్చితంగా పాసవ్వాలన్నారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదివే విద్యార్థులు రాష్ట్ర , జిల్లా స్థాయిలో ర్యాంకులు సాధించాలన్నారు. గత సంవత్సరం ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ముఖ్యమంత్రి చేతులు మీదుగా అవార్డులు అందించామని, ఈ సంవత్సరం కూడా ఉత్తమ ర్యాంకులు సాధించి ముఖ్యమంత్రి చేతులు మీదుగా అవార్డులు అందుకునేలా పట్టుదలగా చదవాలన్నారు. ఈ సంవత్సరం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 991 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవబోతున్నారని చెప్పారు. కార్పొరేట్ స్థాయికి దీటుగా వసతి గృహాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రతి ఒక్క విద్యార్థి పరీక్షకు హాజరవ్వాలన్నారు. పరీక్షల సమయంలో ఎవరూ ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. విద్యార్థి జీవితంలో పదోతరగతి ఒక టర్నింగ్ పాయింట్ అని, ఇప్పుడు కష్టపడి చదివి, ఉత్తమ ఫలితాలు సాధిస్తే ఉన్నత స్థాయిలోకి రావడానికి అవకాశం ఉంటుందన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు బయట ఫుడ్ తినకుండా వార్డెన్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉదయం టిఫిన్ పెట్టి పరీక్షకు పంపాలని, మధ్యాహ్నం విద్యార్థులు వచ్చేసరికి భోజనం రెడీ చేసి వారికి పెట్టాలన్నారు. వార్డెన్లు విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన ఆదేశించారు. విద్యార్థులు పరీక్ష రాసే పరీక్ష కేంద్రాలు దూరంగా ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే అవసరమయిన బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు.అదేవిధంగా దగ్గరగా ఎక్కువ కేంద్రాలు ఉంటే ఆటోలు మాట్లాడి అందరినీ పరీక్షకు అర గంట ముందే పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు చేరుకునేలా ఏర్పాటు చేయాలన్నారు.

**అన్నీ తానైన మంత్రి స్వామి...**

పరీక్షల సమయంలో సాంఘీక సంక్షేమ శాఖ వసతి గృహాలలో చదివే విద్యార్థులకి తల్లిదండ్రులు స్థానంలో అన్ని తానై చూసుకుంటున్న మంత్రి... వారిలో పరీక్షల భయం పోగొట్టి మనోధైర్యం కల్పించడానికి వీడియో కాన్ఫరెన్స్ పెట్టి వారితో పరీక్షల సమయంలో ఏం చెయ్యాలి,ఏం చెయ్యకూడదు అనే విషయాలు చెప్పారు. పరీక్షల సమయంలో వార్డెన్లు విద్యార్థుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకోవటం, వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించటం, విద్యార్థులు సాధించే విజయ కోసం ఆయన ఆతృతగా ఎదురు చూడటం, పరీక్షల నేపద్యంలో తల్లిదండ్రులు చూపే శ్రద్ధ మంత్రి లో కనిపించడం చాలా గొప్ప విషయమని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సాంఘీక సంక్షేమ శాఖ డైరెక్టర్ లావణ్య వేణి, సాంఘీక సంక్షేమ శాఖ డి.డి లక్ష్మా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటుకు దీటుగా

# ప్రభుత్వ బడులు

### 9 వేల మంది విద్యార్థులకు ఉచిత సైకిళ్లు: మంత్రి గొట్టిపాటి



**అద్దంకి(ఆర్సి ఇంచార్జ్) పెన్ పవర్, మార్చి 9**

దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి. రవికుమార్ స్పష్టం చేశారు. అద్దంకి నియోజకవర్గంలో ఇప్పటి వరకు సుమారు 9 వేల మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. సోమవారం అద్దంకి మండలంలోని బొమ్మనంపాడు, శంకరప్పాడు, ధర్మవరం ఉన్నత పాఠశాలలకు చెందిన 364 మంది విద్యార్థులకు ఆయన సైకిళ్లు అందజేశారు. అలాగే బొమ్మనంపాడులో రూ.20 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లు, మురుగునీటి కాలువలు, రూ.35 లక్షలతో ఏర్పాటు చేసిన రక్షిత తాగునీటి పథకాన్ని మంత్రి ప్రారంభించారు. ధర్మవరంలో రూ.30 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. త్వరలోనే మరో రూ.6 కోట్లతో బొమ్మనంపాడులో పలు అభివృద్ధి పనులు చేపడతామన్నారు. దాతల సహకారంతో నియోజ కవర్గంలోని 8 పాఠశాలల్లో రూ.12 లక్షలతో రక్షిత తాగునీటి ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలి పారు. రాబోయే రెండు మూడు రోజుల్లో పదో తరగతి విద్యార్థులం దరికీ, ఏప్రిల్ నెలాఖరుకల్లా మిగిలిన విద్యార్థులకు మరో రెండు వేల సైకిళ్లు అందిస్తామన్నారు. ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమానికి ఎంతో సహకరిస్తున్నా యని మంత్రి కొనియాడారు. విద్యార్థులకు రాజకీ యాలకు తావులేకుండా నాణ్యమైన విద్య, సమయానికి పుస్తకాలు, దుస్తులు అందించాలన్నదే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లక్ష్యమని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 16,300 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని మంత్రి గుర్తుచేశారు.

**సౌర విద్యుత్‌తో 25 ఏళ్లు ఆదా..:** ప్రతి ఒక్కరూ 'ప్రధానమంత్రి సూర్యఘర్' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి గొట్టిపాటి సూచించారు. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.78 వేలు రాయితీ ఇస్తుందని, వెనుకబడిన వర్గాలకు మరో రూ.20 వేలు అదనంగా అందుతుందని తెలిపారు. దళిత, గిరిజనులకు ప్రభుత్వమే పూర్తిగా ఉచితంగా ఈ సౌర విద్యుత్ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఒక్కసారి ఇంటికి సౌర విద్యుత్ పలకలు బిగిస్తే 25 సంవత్సరాల వరకు కరెంటు బిల్లు ఆదా అవుతుందని వివరించారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని పాలుట్ల గ్రామంలో విద్యుత్ లైన్లు వేయలేని ప్రాంతంలోని 611 గిరిజన కుటుంబాలకు ఉచితంగానే సౌర విద్యుత్ అందించామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ నాయకులు, ఉపాధ్యాయులు, అధికారులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఋణాలు మంజూరులో లక్ష్యాలు సాధించాలి

### - జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 09**

ప్రకాశం జిల్లా అభివృద్ధి, ప్రభుత్వ లక్ష్యాల సాధనకు అనుగుణంగా రుణాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు బ్యాంకర్లకు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన అధ్యక్షతన ప్రకాశం భవనములో జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీ సమీక్ష సమావేశం జరిగింది. వివిధ పథకాలకు, స్వయం సహాయక సంఘాలకు బ్యాంకుల ద్వారా మంజూరైన రుణాల వివరాలను ఎల్.డీ.ఎం. రమేష్ ఈ సందర్భంగా కలెక్టరుకు వివరించారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త ఎదగాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ దిశగా, ముఖ్యంగా స్వయం సహాయక సంఘాలకు విరివిగా రుణాలు ఇవ్వాలని ఆయన సూచించారు. డిఆర్డిఏ, మెప్మా ద్వారా బ్యాంకు లింకేజీ రుణాలలో ఘనమైన పురోగతి సాధించడంపై కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రూపొందించిన ' స్వయం' యాప్ ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలను పెంచడంపై దృష్టి సారించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. విశ్వకర్మ పథకంలో కూడా లబ్ధిదారులకు రుణాలను సత్వరమే మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆర్థిక సమ్మిళితం, తలసరి ఆదాయం పెంపు వంటి ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో రుణాలు మంజూరు చేయటంలో సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ బ్యాంకర్లు సమిష్టిగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. పలువురు లబ్ధిదారులకు రుణాల మంజూరు పత్రాలను ఈ కార్యక్రమంలో కలెక్టర్ అందించారు. డిజిటల్ ఫైనాన్షియల్ లిటరసీ పోస్టర్లను కూడా ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆర్.బి.ఐ. నుంచి ఎల్.డి.వో. రోహిత్ అగర్వాల్, నాబార్డ్ డీడీఎం రవికుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.



# ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం

### -ఆయుర్వేద వైద్యశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఇంటూరి

### -ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో 30 లక్షలతో నిర్మాణం -దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేద వైద్యమే బెస్ట్

### -ప్రజల ఆరోగ్య భద్రతకు త్వరలో ఇన్సూరెన్స్ పాలసీ -ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు విస్తరిస్తున్నామని ఎమ్మెల్యే వెల్లడి






**కందుకూరు పెన్ పవర్, మార్చి 9**

ఆయుర్వేద వైద్యంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. కందుకూరులోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల ప్రాంగణంలో కొత్తగా నిర్మించనున్న ఆయుర్వేద వైద్య శాల భవన నిర్మాణానికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో 30 లక్షల రూపాయలతో భవనాన్ని నిర్మించనున్నారు. శంకుస్థాపన అనంతరం, ఆసుపత్రి పరిసరాలను ఎమ్మెల్యే పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పురాతన ఆయుర్వేద చికిత్స విధానాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయుష్ శాఖను ఏర్పాటు చేసింది. అందులో భాగంగానే 30 లక్షలతో ఏరియా ఆసుపత్రిలో ఆయుర్వేద వైద్యశాలకు ప్రత్యేక భవనాన్ని నిర్మిస్తున్నారు. భవనం పూర్తయితే కొత్తగా పంచకర్మ వైద్య సేవలు, అధునాతన లేబరేటరీ ఏర్పాటుతోపాటు అదనపు సిబ్బందిని నియమిస్తారు అని అన్నారు.షుగర్, బిపి, థైరాయిడ్, కొలెస్ట్రాల్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేద వైద్యం చాలా మంచిది. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. అలాంటి వ్యాధులతో బాధపడేవాళ్లు ఈ సేవలను వినియోగించుకోవాలి అని అన్నారు. ప్రజల ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుంది. ఆరోగ్యం సక్రమంగా ఉంటేనే జీవితం సంతోషంగా ఉంటుంది. వైద్యం అందక ఎవరూ చనిపోకూడదన్న ఉద్దేశంతో, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలందరికీ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలను తీసుకొచ్చింది. త్వరలో ప్రతి ఒక్కరికి హెల్త్ కార్డులు అందుతాయి అని అన్నారు. అత్యవసరం వైద్య సేవల కోసం, ఎవరైనా దరఖాస్తు చేసుకున్న రోజునే, రాష్ట్ర ప్రభుత్వం ఎల్ ఓ సి మంజూరు చేస్తోంది. అలాగే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రతిరోజు వేల మందికి చంద్రబాబు విధులు మంజూరు చేస్తున్నారు అని తెలిపారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో అన్ని సేవలను విస్తరిస్తున్నాం. రోగుల సంఖ్యను బట్టి, సిబ్బంది ఇతర సౌకర్యాలు పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం అని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ ఇంద్రాణి, ఆయుర్వేద వైద్యురాలు లక్ష్మీకుమారి, ఆర్ఎంఓ వెంకటరెడ్డి డాక్టర్లు రమాప్రియ, మైథిలి, హరి చందన, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు గడ్డం మాలకొండయ్య, శిగా తిరుపాలు, మువ్వల భూషయ్య, డిఈ పోతయ్య, ఏఈ రత్నం, పార్టీ నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు, అల్లం వెంకటేశ్వర్లు, పొడపాటి నరసింహం, చదలవాడ కొండయ్య, షేక్ రూబీ, బెజవాడ ప్రసాద్, రాయపాటి శ్రీనివాసరావు, రెబ్బవరపు మాల్యాద్రి, షేక్ సలాం, ముచ్చు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఎండలో నడిచే విద్యార్థులకు పాదరక్షలు అందించిన వెంకటయ్య

## దాతను అభినందించిన ఉపాధ్యాయులు





**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 9**

మండలంలోని చింతలపాలెం గ్రామానికి చెందిన జనుమాల వెంకటేశ్వర్లు కుమారుడు వెంకటయ్య మానవతా దృక్పథంతో విద్యార్థులకు పాదరక్షలు అందించి ఆదర్శంగా నిలిచారు. ముండ్లపాడు ప్రాథమిక పాఠశాలకు దర్శి తిమ్మక్కపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు ఎండల్లో నడిచి పాఠశాలకు వస్తున్న పరిస్థితిని గమనించిన ఆయన సుమారు ఐదువేల రూపాయల విలువైన పాదరక్షలను 25 మంది విద్యార్థులకు స్వంత ఖర్చులతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. చెన్నయ్య సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తరఫున ఉపాధ్యాయులు మరియు గ్రామస్తులు దాత వెంకటయ్యను అభినందించారు. దాత వెంకటయ్య మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. చెన్నయ్య గ్రామ పెద్దల సహకారంతో పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సౌకర్యాల కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. ఆ కృషికి తన వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో విద్యార్థులకు పాదరక్షలు అందించినట్లు చెప్పారు. భవిష్యత్తులో కూడా పాఠశాల అభివృద్ధికి తన వంతు సహాయం అందిస్తానని అన్నారు విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. చెన్నయ్య మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు దాతలు ముందుకు వచ్చి సహకారం అందిస్తే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన విద్యా సామగ్రి అందించగలమన్నారు. గ్రామస్తులు గజ్జల కోటిరెడ్డి ఎడ్ల మోసే మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను గుర్తించి పాదరక్షలు అందించిన దాత వెంకటయ్యను అభినందించారు ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు విద్యార్థుల కోసం ముందుకు వచ్చిన ఆయనను గ్రామస్తుల తరఫున అభినందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పలువు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ధర్నాకు బయలుదేరిన ఏపీటీఎఫ్ నాయకులు



**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 9**

టెట్ నోటిఫికేషన్ రాకముందు ఎంపికైన ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో మార్చి 10వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగే ధర్నా కు సి ఎస్ పురం నుండి ఢిల్లీ కి జి టి ఎక్స్ప్రెస్ రైలు లో ఏపీటీఎఫ్ నాయకులు బయలుదేరి వెళ్లారు. ఢిల్లీ కి బయలుదేరిన వారిలో మార్కాపురం జిల్లా అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్, సి యస్ పురం మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసులు జె ఎస్ ఆనంద్ బాబు జిల్లా కార్యదర్శి జి రామక్రిష్ణ , మండల నాయకులు డి సుబ్బరాయుడు, జి వెంకటేశ్వర్లు, ఇండ్ల ప్రసాద్ , ఆర్ సుబ్బయ్య, దండే శ్రీనివాసులు, యన్ గాంధీ , యస్ వహీద్, టీ రమేష్, బి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు . విద్యా హక్కు చట్టం ఆధారంగా సర్వీసు లో ఉన్న ఉపాధ్యాయులు కూడా టెట్ పరీక్షలు ఉత్తీర్ణులు కావాలని, లేని యెడల ఉద్యోగాల నుండి తొలగించాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన పరిస్థితి ఉందని, ఈ తీర్పు రావటానికి మూలమైన విద్యా హక్కు చట్టాన్ని సవరించాలని, టెట్ నోటిఫికేషన్ రాక ముందు ఎంపికైన ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించాలని వారు డిమాండ్ చేశారు.

# కూలీలకు అండగా ఉపాధి హామీ

### మణికేశ్వరంలో పనులు ప్రారంభం.. ఏడాదికి 125 రోజుల పనికల్పన





**అద్దంకి(ఆర్సి ఇంచార్జ్) పెన్ పవర్, మార్చి 9**

అద్దంకి మండలంలోని మణికేశ్వరం గ్రామంలో సోమవారం ఉపాధి హామీ పనులు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. పని ప్రదేశంలో స్థానిక నాయకులు కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నూతన నిబంధనల ప్రకారం ఇకపై ప్రతి కుటుంబానికి ఏడాదికి 125 రోజుల పాటు పనులు కల్పిస్తామని తెలిపారు. ముఖ్యంగా వేసవి కాలంలో ఉపాధి దొరకక ఇతర ప్రాంతాలకు వెళ్లే కూలీల వలసలను నివారించేందుకు ఈ పథకం ఎంతో దోహదపడుతుందని నాయకులు వివరించారు. వ్యవసాయ పనులు లేని సమయంలో గ్రామీణ పేదలకు ఇది కొండంత అండగా నిలుస్తుందని, పెరిగిన వేతనాలు వారి కుటుంబాలకు ఆర్థిక భరోసానిస్తాయని పేర్కొన్నారు. పారదర్శకంగా పనుల నమోదు జరిగి, వేతనాలు నేరుగా కూలీల బ్యాంకు ఖాతాల్లోనే జమ అవుతాయని స్పష్టం చేశారు. ఈ ఉపాధి పనుల ద్వారా గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్. కరిముల్లా, నాయకులు మాథ్యూస్, బలరామిరెడ్డి, పాంటింగ్, అశోక్, ఆదినారాయణ, బడావలి, రాంబాబు, చాంద్ బాషా, గ్రామ క్షేత్ర సహాయకుడు ప్రకాష్, పెద్ద సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# బిసి బాలుల వసతి గృహాలను పరిశీలించిన వ్యవసాయ అధికారి





**అర్ధవీడు, పెన్ పవర్, మార్చి 9**

మండల కేంద్రమైన అర్ధవీడు బిసి బాలుర వసతి గృహాలను నిర్వాహణ అధికారి జి శివగంగ ప్రసాద్ సోమవారం ఆకస్మికంగా పరిశీలించడం జరిగింది. వన్ ఆఫీసర్ వన్ ఇన్స్టిట్యూట్ లో భాగంగా నిర్వాహణ అధికారి సోమవారం సాయంత్రం బిసి బాలుల వసతి గృహాన్ని పరిశీలించడం జరిగింది. దీనిలో భాగంగా విద్యార్థుల హాజరు పట్టిక, భోజన వసతి కార్యాలయము, భోజనం యొక్క మెనూ కాపీలను పరిశీలించడం జరిగింది. అదే విధంగా బాలురతో ముఖాముఖి మాట్లాడడం వారి యొక్క ఏమైనా సమస్యలు ఉంటే తెలియపరచండి అని అడగడం జరిగింది. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ ఎం జూబ్లి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# అంబేద్కర్ చిత్రపటం పదిలమైన జ్ఞాపకం



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ మార్చి 9**

ఇంటర్మీడియట్ విద్యను క్రమశిక్షణతో అభ్యసించి, ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా పరీక్షలు రాస్తూ వసతి గృహం వీడి వెళుతున్న విద్యార్థినులు, తనకు ఇచ్చిన అంబేద్కర్ మహాశయుని చిత్ర పటాన్ని పదిలమైన జ్ఞాపకంగా దాచుకుంటానని హెచ్ డబ్ల్యూఓ జయలక్ష్మి అన్నారు.సోమవారం నియోజకవర్గ కేంద్రంలోని వసతి గృహంలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు ముగుస్తున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ఎక్కడైనా బొకేలు, పెన్నులు ఇచ్చి శాలువాలతో సత్కరిస్తారని, తమ విద్యార్థినులు దేశానికి దిశ నిర్దేశం చేసిన అంబేద్కర్ చిత్రపటం ఇవ్వడంలొ వారి ఔనత్యం చాటుకున్నారని అన్నారు.ఇంటర్ పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించి, ఉన్నత హోదాలో ఉండాలని దీవించారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారి సిహెచ్. జయలక్ష్మి తమ పట్ల చూపుతున్న ఆదరణకు, అందిస్తున్న ప్రోత్సాహానికి కృతజ్ఞతగా విద్యార్థినులు అరుదైన బహుమతిని ఎంచుకోవడం అభినందనలు అందుకుంది.విద్యాభ్యాసం కోసం వసతి గృహంలో ఉంటున్న తమకు తల్లిలాంటి ఆదరణ అందిస్తూ, చదువుపై శ్రద్ధ పెరిగేలా చేస్తున్న జయలక్ష్మి సేవలను విద్యార్థినులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది మరియు ఇంటర్మీడియట్ విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కె వి నరసయ్య జంక్షన్‌లో లైట్లు లేక వాహనాదారులకు ఇబ్బందులు



**సి.ఎస్.పురం, పెన్ పవర్ మార్చి 9**

మండలంలోని సి.ఎస్.పురం నుండి పామూరు వెళ్లే నేషనల్ హైవే రోడ్డుపై కోవిలంపాడు సమీపంలో ఉన్న కదిరి వెంకట నరసయ్య జంక్షన్ వద్ద లైట్లు లేకపోవడంతో వాహనాదారులు మరియు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలువురు వాహనదారులు తెలిపారు. ముఖ్యంగా జంక్షన్ వద్ద రాత్రి సమయంలో సరైన లైటింగ్ లేకపోవడంతో చీకటి ఎక్కువగా ఉండి ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించక ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులు వివిధ గ్రామ ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం ఇటీవల చీకటిలో రహదారి స్పష్టంగా కనిపించక నేషనల్ హైవే మీదుగా వెళ్లే వాహనాలు గేదలను ఢీకొట్టిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో అనేక గేదలు మృతి చెందాయని అన్నారు రాత్రి సమయంలో వాహనాల రాకపోకలు ఉండటంతో చీకటిలో కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు ఈ జంక్షన్ ద్వారా కదిరి బాబురావు అగ్రికల్చర్ కాలేజీ, శీలంవారిపల్లి, ఆనికాలపల్లి, నల్లమడుగుల వంటి గ్రామాల ప్రజలు ప్రతిరోజూ పామూరు, సి.ఎస్.పురం ప్రాంతాలకు వివిధ అవసరాల నిమిత్తం వందలాది వాహనాలలో ప్రజలు ప్రయాణం చేస్తుంటారు కానీ జంక్షన్ సమీపంలో లైట్లు లేకపోవడం వల్ల వాహనాలు ఎటు నుంచి వస్తున్నాయో గుర్తించడం కష్టమై ఈ మార్గంలో ప్రయాణించే వాహనాదారులు ఇబ్బందులకు గురవుతున్నామని అంటున్నారు. సంబంధిత నేషనల్ హైవే అధికారులు స్పందించి కదిరి వెంకట నరసయ్య జంక్షన్ వద్ద సిగ్నల్ లైట్లు, లైట్లు ఏర్పాటు చేసి వాహనదారుల భద్రతను కాపాడాలని వాహనదారులు పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# కొమరోలు ఎంపీడీవోగా రమేష్ బాబు

### సింగరాయకొండ మండల పరిషత్ లో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తూ ఎంపీడీవోగా పదోన్నతి పొందిన రమేష్ బాబు

**కొమరోలు పెన్ పవర్ మార్చి 9**

కొమరోలు నూతన ఎంపీడీవోగా రమేష్ బాబు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సింగరాయకొండ మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న రమేష్ బాబుకు ఎంపీడీవోగా పదోన్నతి కల్పించి కొమరోలు మండలానికి ఎంపీడీవో గా నియమించారు. కొమరోలు ఎంపీడీవో గా పనిచేస్తూ ఉన్న సానికొమ్ము సత్యం గత ఏడాది డిసెంబర్ 31న ఉద్యోగ పదవీ విరమణ చేశారు .అప్పటినుంచి ఎంపీడీవో పోస్టు ఖాళీగా ఉంటున్నందువల్ల మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవో గా పని చేస్తున్న చెన్నారావు ఇన్చార్జి ఎంపిడిఓ గా కొనసాగుతున్నారు. అయితే కొమరోలు మండల పరిషత్తు కార్యాలయానికి నూతన ఎంపీడీవో గా నియమించబడిన రమేష్ బాబు సోమవారం డిప్యూటీ ఎంపీడీవో చెన్నారావు నుంచి ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి అందరి సహకారంతో కృషి చేస్తానని రమేష్ బాబు తెలిపారు.



# డొక్కల వాగులో మట్టి వేయడాన్ని నిలుపుదల చేయించాలి

సి



**ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 9**

పీరు మోటు ప్రాంతంలో డోక్కల వాగులో మట్టిని వేయడాన్ని నిలుపుదల చేయించాలని రైతు సంఘం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు కోరారు. గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మిస్తున్న వారు పీరుమోటుకు సమీపంలో డొక్కల వాగులో వేస్తున్న మట్టి కారణంగా వాగు వచ్చినప్పుడు నీరు పొలాల పైకి వెళ్లే అవకాశం ఉందంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో రైతు సంఘం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు సోమవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మిస్తున్న వారు వేస్తున్న మట్టి వాగులో అడ్డుగా వేస్తుండడంతో వాగు వచ్చినపుడు నీరు వ్యవసాయ పొలాల పైకి వెళ్లి భూములు కోతకు గురయ్యే అవకాశం ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాగులో వేస్తున్న మట్టిని నిలుపుదల చేయించి ఇప్పటివరకు వేసిన మట్టిని కూడా అక్కడి నుంచి తొలగించే ఏర్పాటు చేయించాలని ఆయన కోరారు.

# ప్రకాశంలో ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్

**కందుకూరు పెన్ పవర్, మార్చి 9**

స్వయంప్రతిపత్తి కలిగిన ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలోని సి.ఎస్.ఇ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) విభాగం ఆధ్వర్యంలో "ఫ్యూచర్ ట్రెండ్స్ ఇన్ మెషిన్ లెర్నింగ్ అండ్ డేటా సైన్స్ -- డ్రివెన్ మోడలింగ్" అనే అంశంపై ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ఇటీవల నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఇగ్నైట్ ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థకు చెందిన నిపుణులు రిసోర్స్ పర్సన్లుగా పాల్గొని మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ ఆధునిక డేటా ఆధారిత మోడలింగ్ విధానాలపై అధ్యాపకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డా. కె. విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ మరియు డేటా సైన్స్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అధ్యాపకులు నిరంతరం తమ నైపుణ్యాలను పెంపొందించుకోవడం అత్యంత అవసరమని తెలిపారు. ఇలాంటి ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కార్యక్రమాలు బోధన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. సీహెచ్. రవి కుమార్ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అధ్యాపకులు లోతైన అవగాహన పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులకు మెరుగైన మార్గదర్శకత్వం అందించగలరని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పాల్గొన్న అధ్యాపకులు మెషిన్ లెర్నింగ్ డేటా సైన్స్ రంగాలలో తాజా సాంకేతిక ధోరణులపై సమగ్ర అవగాహన పొందడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సి.ఎస్.ఇ (ఏ.ఐ) విభాగాధిపతి డా. కె. సుబ్బా రెడ్డి కన్వీనర్‌గా నిర్వహించగా, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కె. శ్రీహరి ఎ. మధు కోఆర్డినేటర్లుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా వివిధ విద్యాసంస్థల నుండి అధ్యాపకులు, అలాగే ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు పాల్గొని నిపుణుల ఉపన్యాసాలు, హ్యాండ్స్-ఆన్ సెషన్లు చర్చల ద్వారా తమ సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నారు.ఈ కార్యక్రమం అధ్యాపకులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించేందుకు దోహదపడుతుందని వైస్ ప్రిన్సిపాల్ వి. హరిబాబు తెలిపారు.

# రంజాన్ ఉపవాసా దీక్షలలో చిన్నారులు

పెద్దలతో సమానంగా కఠోర నియమాలతో ఉపవాస దీక్షలు కొనసాగిస్తున్న బాల బాలికలు.

**వేకువ జామున 5 గంటలకు ఆహారం తీసుకుని సాయంత్రం 6:30 గంటల వరకు కఠోర ఉపవాస దీక్ష చేస్తున్న పసిపిల్లలు.**





**కొమరోలు పెన్ పవర్ మార్చి 9**

రంజాన్ మాసపు ఉపవాసా దీక్షలలో పెద్దలతో సమానంగా చిన్నారులు కూడా కఠోర నియమాలతో దీక్షలు కొనసాగిస్తూ పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తున్నారు. ముస్లింలకు రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనది. రంజాన్ నెలవంక చూసిన మరుసటి రోజు నుంచి ముస్లింలు ఉపవాస దీక్షలు చేపట్టారు. 30 రోజులపాటు సాగే కఠోర నియమాలతో దీక్షలు కొనసాగిస్తున్నారు. వేకువ నాలుగు గంటలకే లేచి కాల కృత్యాలు ముగించుకుని ఐదు గంటల లోపు సహరీ చేసి ఆహార పానీయాలు తీసుకుంటారు. ఆ తరువాత సాయంత్రం 6:30 వరకు ఎలాంటి ఆహార పానీయాలు, పండ్లు, కా,ఫీ టిఫిన్ తదితర ఎలాంటి పదార్థాలు తీసుకోకుండా , చివరకు నోటిలో ఊరే లాలాజలాన్ని కూడా మింగకుండా మనసును అల్లాపై ఉంచి దినచర్యలు యధావిధిగా చేసుకుంటూ, ఐదు పూటల నమాజులు చేస్తూ కఠోర నియమాలతో ఉపవాసా దీక్షలు కొనసాగిస్తారు. ఇలాంటి కఠోర ఉపవాస దీక్షలు ముస్లిం మతానికి చెందిన పురుషులు, స్త్రీలు ,యువకులు కొనసాగించడం సహజంగా ప్రతి సంవత్సరం రంజాన్ మాసంలో జరుగుతూ ఉంటుంది . అయితే ఈ ఏడాది కూడా పట్టుమని పది సంవత్సరాల వయస్సు కూడా నిండని చిన్నారులు కూడా పెద్దలతో సమానంగా వేకువజామున ఐదు గంటలకు ఆహార పానీయాలు తీసుకుని సాయంత్రం 6:30 వరకు కఠోర నియమాలతో ఉపవాసా దీక్షలు కొనసాగిస్తున్నారు. చిన్నారులు ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునేంతవరకు ఆహార పానీయాలతో పాటు తమకు ఇష్టమైన చిరుతిళ్లు కొని తింటూ ఉత్సాహంగా ఆనందంగా కాలం గడుపుతూ ఉంటారు. అలాంటి చిన్నారులు రంజాన్ మాసంలో పెద్దలతో సమానంగా కఠోర నియమాలతో ఉపవాస దీక్షలలో పాల్గొనడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. పాఠశాలలకు వెళ్లే చిన్నారులు కూడా ఉపవాసా దీక్షలలో పాల్గొంటూ పాఠశాలలకు వెళ్లి వస్తున్నారు. పాఠశాలల్లో విరామ సమయంలో తమ తోటి చిన్నారులు చిరు తిండ్లు తింటున్నప్పటికీ వారి వైపు కన్నెత్తి చూడకుండా మనసును నిగ్రహించుకొని అల్లాపై ధ్యాస పెట్టి ఉపవాస దీక్షలు కొనసాగిస్తున్నారు. గత వారం రోజులుగా ఒకవైపు పగలు వేసవి కాలాన్ని తలపిస్తూ ఎండలు కాస్తున్నాయి. దీనితో ఉపవాస దీక్షలు చేస్తున్న పెద్దలే ఉష్ణతాపానికి తలడిల్లిపోతున్నారు .అలాంటి ప్రతికూల వాతావరణంలో కూడా చిన్నారులు కఠోర నియమాలతో దీక్షలు కొనసాగిస్తున్నారు. కొమరోలు లోని జామియా మసీదు లో జరిగే ఇఫ్తార్ సమయంలో దాదాపు 20 నుంచి 30 మంది చిన్నారులు ఇఫ్తార్లో పాల్గొంటూ ఉపవాస దీక్షలు విరమిస్తున్నారు. ఇక కొమరోలు లోని మరో రెండు మసీదులలో కూడా చిన్నారులు అధిక సంఖ్యలో ఉపవాస దీక్షలో పాల్గొంటున్నారు. ఇక మండలంలోని అల్లినగరం, రెడ్డి చర్ల ,పోసు పల్లె, ఇడమకల్లు, ముక్తాపురం, గుంద్రెడ్డిపల్లి, రాజుపాలెం, నల్లగుంట్ల, హనుమంతు రాయనిపల్లె, పుల్లారెడ్డి పల్లె ,చింతలపల్లె తదితర గ్రామాలలోని ముస్లిం పెద్దలతో పాటు చిన్నారులు కూడా ఉపవాస దీక్షలు కొనసాగిస్తున్నారు. సాయంత్రానికి నీరసించిపోతూ కళ తప్పిన ముఖాలతో ఇఫ్తార్ లో పాల్గొంటున్న చిన్నారులకు ఆయురారోగ్యాలు ప్రసాదించమని మత పెద్దలు ప్రార్థిస్తున్నారు. ఇఫ్తార్ సమయంలో ఉపవాసా దీక్ష పరులకు ఇఫ్తార్ సమయంలో పండ్లు తీపి పదార్థాలు, చల్లని పానీయాలు అందించేందుకు వస్తున్న ముస్లిమేతరులు ఉపవాస దీక్షలు కొనసాగిస్తూ ఇఫ్తార్ చేసేందుకు సిద్ధంగా కూర్చున్న చిన్నారులను చూస్తూ ఆశ్చర్యానికి గురవుతూ చిన్నారులను అల్లా చల్లగా చూడాలని ఆశీర్వదిస్తున్నారు ఇక మదరసాలలో చదువుకుంటున్న చిన్న వయసు గల బాలికలు కూడా 30 రోజులపాటు సాగే కఠోర నియమాలతో ఉపవాస దీక్షలు కొనసాగిస్తున్నారు.

## వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని జయప్రదం చేయాలి...

**ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగంగుంట్ల రాములు**

**పుల్లల చెరువు పెన్ పవర్ మార్చి 9**




ఈ నెల 11వ తేదీన కాకినాడలో నిర్వహించనున్న వైఎస్ఆర్సిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యవర్గ విస్తృత సమావేశాన్ని జయప్రదంగా నిర్వహించాల్సిందిగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు వైఎస్ఆర్సిపి రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి, పుల్లలచెరువు మండల పరిషత్ ఉపాధ్యక్షులు లింగంగుంట్ల రాములు పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్సిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 11వ తేదీన కాకినాడ నగరంలో రాష్ట్ర స్థాయి ఎస్సీ సెల్ కార్యవర్గ విస్తృత సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ సెల్‌కు చెందిన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు టీజేఆర్ సుధాకర్ బాబు, రాష్ట్ర కార్యదర్శి కనకారావు తదితర ముఖ్య నాయకులు హాజరై ప్రసంగించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం, ఎస్సీ సెల్ కార్యాచరణ, భవిష్యత్ రాజకీయ వ్యూహాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ సెల్ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రజా సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై కూడా సమీక్ష జరగనుందని పేర్కొన్నారు. పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు గ్రామస్థాయిలో ఎస్సీ సెల్ కార్యకలాపాలను విస్తరించే దిశగా కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని లింగంగుంట్ల రాములు విజ్ఞప్తి చేశారు. పార్టీ అభివృద్ధి, సామాజిక న్యాయం సాధనలో ఎస్సీ సెల్ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

## మీకోసం లో అర్జీలు పరిష్కరించాలి





**కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ మార్చి09**

మీకోసం అర్జీల పరిష్కారంలో నాణ్యత అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. సోమవారం ప్రకాశం భవనంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, కందుకూరు సబ్ కలెక్టర్ డి. హిమవంశీ, జిల్లా రెవెన్యూ అధికారి బి. చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మాధురి, కళావతి, డిపిఓ వెంకటేశ్వరరావులతో కలసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సకాలంలో పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులకు సూచించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లీనిక్ ల ద్వారా వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారులు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు సవివరంగా వివరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 277 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్షకు 23 మంది గైర్హాజరు

**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 9**

ఇంటర్మీడియట్ థియరీ పరీక్షల్లో భాగంగా 12 వరోజు సోమవారంనాడు రెండవ సంవత్సరం విద్యార్థులకు పరీక్ష నిర్వహించబడింది. మ్యాథమ్యాటిక్స్ -2బి తో పాటు ఒకేషనల్ వారికి బ్రిడ్జి కోర్సు - బయలాజికల్ సైన్సెస్ -2 ఈ రోజు నిర్వహించబడ్డాయి. పరీక్ష కేంద్రాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు కె. సత్యరామిరెడ్డి, చంద్రశేఖర్ రావు,కస్టోడియన్ వి. పూర్ణ చంద్రుడు తనిఖీ నిర్వహించారు. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు ఎం. మురళీకృష్ణ,ఎ. అల్లూరయ్య,ఆర్. శిరీష కుమారి హాజరు వివరాలను తెలిపారు. పట్టణములోని మూడు పరీక్ష కేంద్రాలకు 470 మంది హాజరవ్వాల్సి ఉండగా 447 మంది హాజరు కాగా 23 మంది గైర్హాజరయ్యారు. కేంద్రాల వారీగా వివరాలిలా ఉన్నాయి. శ్రీ వివేకానంద జూనియర్ కళాశాలలో 173 మందికి 166 మంది హాజరు కాగా ఏడుగురు గైర్హాజరయ్యారు. శ్రీ జీవనజ్యోతి జూనియర్ కళాశాలలో 173 మందికి 166 మంది హాజరు కాగా ఏడుగురు గైర్హాజరయ్యారు. సాహితి జూనియర్ కళాశాలలో 12 4 మందికి 115 మంది హాజరై, 9 మంది గైర్హాజరయ్యారు.

## అడవిరాజుపాలెం హైస్కూలులో ఘనంగా మహిళా దినోత్సవం





**గుడ్లూరు, పెన్ పవర్, మార్చి 09**

మండలంలోని అడవిరాజుపాలెంలో ఉన్న జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.రాజా అధ్యక్షతన సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సేవలందిస్తున్న కాపులూరి వరలక్ష్మి (పి.ఎస్ హెచ్.ఎం) మరియు చుండూరి వసంతకుమారి (ఎస్.ఏ పీ.ఎస్ టీచర్)లను పాఠశాల తరపున ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు పిగిలి మనోహరం మాట్లాడుతూ మహిళలు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, విద్యా రంగంలో మహిళా ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ముఖ్యమైన సేవలు అందిస్తున్నారని అన్నారు. మహిళల సాధికారత సమాజ పురోగతికి దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.రాజా, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు ఇద్దరు మహిళ ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రదానోపా ధ్యాయులు జి.రాజా, పిగిలి మనోహరం, కే.సుధాకర్ రావు , కె.వెంకటేశ్వర్లు, జి.కొండయ్య, కె.శ్రీనివాసులు, పి.మాల్యాద్రి, ఆర్.రమణారావు తదితరులు మరియు విద్యార్థులు పాల్గొని మహిళా దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. ఈకార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య ఎంతో విజయవంతంగా జరిగినది.

## కాకినాడలో 11న వైఎస్ఆర్సిపి విస్తృత స్థాయి సమావేశం

**జయప్రదం చేయాలని మురారి పిలుపు**

**మార్కాపురం పెన్ పవర్ మార్చి 9**



ఈనెల 11న కాకినాడలో వైఎస్ఆర్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం జరుగుతుందని, ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలంటూ వైఎస్ ఆర్ సి.పి, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి మురారి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో కోరారు. వైయస్సార్సీపి రాష్ట్ర అధ్యక్షుడు మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎస్సి సెల్ నాయకులు టీజేఆర్ సుధాకర్ బాబు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు నాయకులు విస్తృతంగా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## ఆరోగ్యకరమైన జీవనం కోసం అవగాహన కార్యక్రమం -మానవహారం ఏర్పాటు






**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 9**

కనిగిరి మండలం తుమ్మగుంట గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ మహోత్సవ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా సోమవారం మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, సమగ్ర శిక్ష అభియాన్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆరోగ్యకరమైన జీవనం కోసం ఆరోగ్యకరమైన స్థిరమైన జీవనశైలిని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలకు సమతుల్య ఆహారం తీసుకోవడం, రోజువారీ వ్యాయామం చేయడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వంటి విషయాలపై వివరిస్తూ మానవహారం నిర్వహించడం జరిగింది. మంచి ఆహారపు అలవాట్లు, పరిశుభ్రత మరియు వ్యాయామం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. గ్రామ ప్రజలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకొని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట రెడ్డి,పారా లీగల్ వాలంటీర్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు, అంగన్వాడీ టీచర్ విజయ రాణి, మహిళా పోలీస్,ఆశా కార్యకర్తలు ఉపాధ్యాయులు, గ్రామస్తులు, పొదుపు సంఘం మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మలినేని సుశీలమ్మ మహిళా కళాశాలలో విహంగ్ బ్రోచర్ ఆవిష్కరణ



**కందుకూరు పెన్ పవర్, మార్చి 9**

స్థానిక మలినేని సుశీలమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మార్చి 17వ తేదీన నిర్వహించనున్న జాతీయ స్థాయి టెక్నో--కల్చరల్--స్పోర్ట్స్ ఫెస్ట్ "విహంగ్" సందర్భంగా ఆ ఫెస్ట్‌కు సంబంధించిన బ్రోచర్‌ను కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది కేవలం మహిళా విద్యార్థులకే పరిమితమని విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి, సాంకేతిక, సాంస్కృతిక క్రీడా రంగాలలో వారి నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి ఇలాంటి ఉత్సవాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ ఫెస్ట్‌లో వివిధ పోటీలలో విజేతలకు మొత్తం రెండు లక్షల రూపాయల వరకు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఏ. గోపాలకృష్ణమూర్తి, వైస్ ప్రిన్సిపల్ వి. కోటేశ్వరరావు, ఏవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అలాగే ఐడీపీఎస్ డైరెక్టర్ డాక్టర్ బసివి రెడ్డి, ఐడీపీఎస్ ప్రిన్సిపల్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సాయిబాబు హాజరయ్యారు. అదనంగా సీఎస్సీ విభాగాధిపతి జ్యోతి, ఎస్ఎన్‌హెచ్ విభాగాధిపతి వసుమతి, ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినులు పాల్గొన్నారు.

## మహిళాభివృద్ధి తోనే సమాజాభివృద్ధి అన్ని విధాలా సాధ్యం

***రాష్ట్ర బిజెపి మహిళా నాయకురాలు బెల్లంకొండ విజయలక్ష్మి స్పష్టం***

**పొదిలి, పెన్ పవర్, మార్చి 9**




మహిళాభివృద్ధి తోనే సమాజాభివృద్ధి అన్ని విధాల సాధ్యపడుతుందని రాష్ట్ర బిజెపి మహిళా మోర్చా కార్యదర్శి, బెల్లంకొండ విద్యాసంస్థల అధినేత్రి బెల్లంకొండ విజయలక్ష్మి చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని సోమవారం నాడు హనుమంతునిపాడు మండలంలోని వేములపాడు గ్రామంలో నిర్వహించిన బాలికల 2ని రన్ కార్యక్రమంలో విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ బాలికలు క్రమశిక్షణతో చక్కగా విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. ఒక మహిళ విద్యావంతురాలు అయితే ఆ ప్రభావము ఆమె కుటుంబం మొత్తం మీద ఉంటుందని విజయలక్ష్మి అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మహిళా విద్య పట్ల అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అందులో భాగంగానే బాలికలకు విద్య లో ప్రోత్సహించేందుకు వివిధ పథకాలు, రాయితీలు అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను, పథకాలను బాలికలు సద్వినియోగపరచుకొని ఉన్నత విద్యావంతురాలుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నరేష్, త్రిమూర్తులు, బిజెపి జిల్లా మైనార్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాదర్ భాష, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సంతమాగులూరులో ఘనంగా మహిళా దినోత్సవం

## మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం

**అద్దంకి(ఆర్సి ఇంచార్జ్) పెన్ పవర్, మార్చి 9**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సంతమాగులూరులోని మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయ సమావేశ మందిరంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రాజెక్ట్ సీడీపీఓ డి.సుధా అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా మండల ఎంపీడీఓ జ్యోతిర్మయి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. స్త్రీ లేనిదే సృష్టి లేదని, భారతీయ సంస్కృతిలో మహిళలకు ఎంతో గొప్ప స్థానం ఉందని గుర్తుచేశారు. కుటుంబాన్ని ఓర్పు, సహనాలతో ముందుకు నడిపించే శక్తి మహిళలదేనని.. నేడు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా పోటీ పడుతూ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆమె కొనియాడారు. మహిళా దినోత్సవం అనేది మహిళల విజయగాథలను పంచుకునే వేదిక అని, అణచివేతకు, వివక్షకు గురవుతున్న వారికి అండగా నిలవాలని సీడీపీఓ సుధా పిలుపునిచ్చారు.

**ఘనంగా సన్మానాలు.. బహుమతుల ప్రదానం**

బాలికలు లైంగిక వేధింపులను ధైర్యంగా ఎదిరించాలని, అవాంఛనీయ ఘటనలు ఎదురైనప్పుడు 'వద్దు' అని గట్టిగా చెప్పే స్థైర్యం పెంపొందించుకోవాలని ఈ సమావేశంలో వక్తలు అవగాహన



కల్పించారు. ప్రతి ఇంటికి ఒక మహిళా పారిశ్రామికవేత్త ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించాలని సూచించారు. అనంతరం అధికారులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను ఘనంగా సన్మానించడంతో పాటు, ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి



బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంతమాగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్. నిర్మల్ కుమార్, టీడీపీ నాయకురాలు సుజాత, వెలుగు ఏపీఎం హనుమంతరావు, ఐసీడీఎస్ పర్యవేక్షకులు ప్రమీల, సుష్మ, మంజుల, మహిళా పోలీసు మహాలక్ష్మి, ఆశా కార్యకర్త కమల, ఉమ, అనూష, కిరణ్, కోటేశ్వరరావు, సత్యనారాయణతో పాటు సంతమాగులూరు, బల్లికురవ మండలాల అంగన్వాడీ టీచర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# విజయేంద్ర సరస్వతిని కలసిన ఎమ్మెల్యే ఉగ్ర



**పొదిలి, పెన్ పవర్, మార్చి 9**

కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామిని ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు నరసింహారెడ్డి కలుసుకున్నారు. విజయేంద్ర సరస్వతి స్వామి సోమవారం నాడు మండలంలోని ఓబులక్కపల్లె గ్రామంలో గల శంకర విద్యాలయం సందర్శన కోసం విచ్చేసిన సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి స్వామిని కలసి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనుల గురించి ఆయన స్వామి వారితో మాట్లాడారు. అలాగే కనిగిరి ప్రాంత అభివృద్ధిలో స్వామి భాగస్వాములు కావాలని, కనిగిరి ప్రాంతంలో కూడా చక్కటి వైద్యశాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి స్వామి దృష్టికి తీసుకుని వెళ్లారు. కనిగిరి ప్రాంతంలో ఫ్లోరిడ్ నీటి వల్ల కిడ్నీ బాధితులు అధికంగా ఉన్నారని, పలు అనారోగ్య సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి విజయేంద్ర సరస్వతి స్వామి వారి దృష్టికి తీసుకుని వెళ్లారు.

# కేజిబివిలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ మార్చి09**



జిల్లా లో గల 28 కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో (కె.జి.బి.వి.) 2026-27 అడ్మిషన్ల కోసం 6 నుండి 11వ తరగతులకు, 7,8,9, 10,12 తరగతులలో మిగిలిపోయిన ఖాళీ సీట్లకు కూడా మార్చి 12 వ తేదీ నుండి ఏప్రిల్ 01 వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించ నున్నట్లు ఎస్ ఎస్ ఏ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ అనిల్ కుమార్ దాసరి ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శ కాల ప్రకారం, బడి బయట ఉన్న బాలికలు, డ్రాపౌట్స్, అనాథలు, సెమీ అనాథలు, పిహెచ్ సీ లకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మిగిలిపోయిన సీట్లను ఎస్సీ, ఎస్టీ , ఓబిసి, మైనారిటీ వర్గం, బిపిఎల్ అభ్యర్థుల ప్రాధాన్యత క్రమంలో అడ్మిషన్ల భర్తీ చేయబడును అని తెలియజేశారు.

# సమస్యల పై స్పందించండి

### - ఎమ్మెల్యే దామచర్ల



**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు మార్చి09**

నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం స్థానిక శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ప్రజల యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్జీ దారులు వారికి సమస్యలను వెంటనే పరిష్కరాలు చేయాలని కోరారు. అర్జీ దారులకు సంబంధించిన సమస్యలపై అధికారులతో ఫోన్ లో మాట్లాడి వెంటనే పరిష్కారం చేయాలని అధికారులను కోరారు.

# పొదిలిలో విజయేంద్ర సరస్వతి కి ఘన స్వాగతం

**పొదిలి, పెన్ పవర్, మార్చి 9**

కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామికి పొదిలిలో ఘనస్వాగతం లభించింది. సోమవారం నాడు పొదిలికి విచ్చేసిన శంకర విజయేంద్ర సరస్వతి స్వామి స్థానిక శివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మ మహేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి గురించి పలువురితో మాట్లాడుతూ వాకబు చేశారు. అలాగే ఆలయ చైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య తో కూడా మాట్లాడి ఆలయ అభివృద్ధి విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆలయ అభివృద్ధితోపాటు భూముల వివరాలు, ఆదాయ వ్యయాల గురించి చైర్మన్ వెంకట్రామయ్య విజయేంద్ర సరస్వతి స్వామికి వివరించారు. ఆలయ అభివృద్ధిపై చర్చించేందుకు కంచికి రావాల్సిందిగా విజయేంద్ర సరస్వతి స్వామి ఆలయ చైర్మన్ ఒగ్గు వెంకటరామయ్యను సూచించారు.



# 14 నుండి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల బాల బాలికలకు హెచ్ పి. వి వ్యాక్సిన్

**భవిష్యత్తులో సర్వైకల్ క్యాన్సర్ చూపకుండా ముందు జాగ్రత్త చర్యలుగా హెచ్పీవీ వ్యాక్సిన్ దోహదం.**

**హెచ్ పి వి వ్యాక్సిన్ వినియోగంపై ఎంఎల్ హెచ్ పి లకు ,ఏఎన్ఎం లకు ,**

**ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించిన కొమరోలు మెడికల్ ఆఫీసర్ వి.శాంతి.**



**కొమరోలు పెన్ పవర్ మార్చి 9**

14 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల బాల బాలికలకు భవిష్యత్తులో సర్వైకల్ క్యాన్సర్ చేయకుండా ఉండేందుకు వీలుగా ముందు జాగ్రత్తగా హెచ్ పి వి వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయాలని కొమరోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ వి శాంతి వైద్యారోగ్య శాఖ సిబ్బందికి సూచనలు సలహాలు ఇస్తూ అవగాహన కల్పించారు .సోమవారం కొమరోలు లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎం ఎల్ హెచ్ పి లు ,ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు .ఆ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ వి శాంతి మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది గ్రామాలలో పర్యటించి 14 నుంచి 15 సంవత్సరాల మధ్య వయసు గల బాల బాలికలను గుర్తించి వారి జాబితాను సిద్ధం చేయాలని తెలిపారు. ఆ మేరకు బాల బాలికలకు భవిష్యత్తులో సర్వైకల్ క్యాన్సర్ చూడకుండా ఉండేందుకు వీలుగా ముందు జాగ్రత్తగా వారికి హెచ్ పి వి వ్యాక్సిన్ వేయాలని కోరారు. అంతేకాక వ్యాక్సిన్ పై బాల బాలికలతో పాటు వారి తల్లిదండ్రులు కూడా సంపూర్ణ అవగాహన కల్పించాలని ఆమె తెలిపారు. అంతేకాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ,ఆరోగ్య ఉప కేంద్రాలు రోగులకు అందిస్తున్న మెరుగైన సేవలను, అందుబాటులో ఉంటున్న అన్ని రకాల మందులు ,వైద్య పరీక్షలు, రక్త సురక్షిత ప్రసవాలు తదితర వాటిపై కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు .ఆ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు ఆవులయ్య, సౌజన్య ,ఎమ్ యల్ హెచ్ పి లు, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# గడపగడపకు సిపిఐను విజయవంతం చేయండి -బూసి సురేష్ బాబు

**కందుకూరు పెన్ పవర్, మార్చి 9**

ఈ నెల 11వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్త జరిగే గడప గడపకు సిపిఐ కార్యక్రమం విజయవంతం చేయాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి బొజ్జ చంద్రమోహన్ అధ్యక్షతన సిపిఐ నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా బూసి సురేష్ బాబు మాట్లాడుతూ దేశ ప్రజల భవిష్యత్తును ప్రధాని నరేంద్ర మోడీ తన చేతిలో పెట్టుకొని ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో నరేంద్ర మోడీ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా గ్యాస్ ధరలను పెంచి ప్రజలపై అధిక భారం మోపుతున్నారని ఆయన మండిపడ్డారు. దేశంలో బిజెపి పాలిత ప్రాంతాలు అనుబంధ పార్టీల ప్రాంతాల ప్రజల భవిష్యత్తు అతలాకుతలం అవుతున్నాయని బిజెపి చెప్పిందే వేదం అన్నట్టు అక్కడి పాలకులు పాలిస్తూ ప్రజలను ఇబ్బందులు పడుతున్న తరుణంలో అన్ని చోట్ల బిజెపికి ఎదురు తిరుగుతున్న పరిస్థితి ఉందని ఆయన అన్నారు. మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తోపాటు వైసీపీ పార్టీ కూడా నరేంద్ర మోడీకి మద్దతు తెలుపుతూ తమ రాజకీయ భవిష్యత్తు కోసం పోటీ పడుతున్నాయని ఆయన అన్నారు. ప్రజల కష్టాలను పట్టించుకోకుండా




కాలయాపన చేస్తున్నారని ఆయన అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలలోకి తీసుకు వెళ్లేందుకు సిపిఐ రాష్ట్ర సమితి గడపగడపకు సిపిఐ నినాదంతో కార్యక్రమాన్ని చేపట్టిందని ఈ కార్యక్రమం విజయవంతానికి ప్రతి ఒక్కరు పనిచేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వై ఆనందమోహన్, కే మురళి, నరసయ్య, లక్ష్మీనారాయణ, ఆదినారాయణ, ఉప్పుటూరి మాధవరావు, దుర్గా ప్రసాద్, కాకుమాని రవణమ్మ, ఓలేటి కల్పన, పులి నాగేశ్వరరావు, బొల్లోజుల బాల బ్రహ్మచారి, కోటేశ్వరరావు రాము తదితరులు పాల్గొన్నారు.

# మీసాల వెంకన్నగా శేషవాహనంపై శ్రీవారి దర్శనం

**కొనకనమిట్ల పెన్ పవర్ మార్చి 9**

వెలుగొండ క్షేత్రంలో జరుగుతున్న శ్రీ లక్ష్మీ సమేత వెలుగొండ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీవారు మీసాల వెంకన్న శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.ఆలయ పరిసరాలలో భక్తుల నడుమ అంగరంగ వైభవంగా స్వామివారి ఊరేగింపు నిర్వహించారు.ఈ సందర్భంగా ఉభయదాతలు స్వామివారి దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారికి పూలమాలలు,కాయ కర్పూరం, వస్త్రాలు సమర్పించి హోమాలు నిర్వహించారు. అనంతరం శ్రీవారి ఊరేగింపు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వెలుగొండ క్షేత్రంలో ఉభయదాతలు అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేసి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి,ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కుందూరు కాశిరెడ్డి,భాషాపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# పోలీసు స్పందనకు 71 ఫిర్యాదులు






**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి09**

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమంను ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు నిర్వహించారు. జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన 71 ఫిర్యాదిదారుల అర్జీలను ఎస్పీ, పోలీస్ అధికారులు స్వీకరించి వారితో ముఖాముఖిగా మాట్లాడి ఫిర్యాదుల గురించి సవివరంగా అడిగి తెలుసుకుని వాటిని చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని వారికి భరోసా కల్పించారు. ఫిర్యాదు చేసిన ప్రతి వ్యక్తి సమస్యను చట్టపరంగా పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఫిర్యాదు చేయడానికి వచ్చే వారిలో కొంత మంది వృద్ధులు, నడవలేని స్థితిలో ఉండేవారు ఫిర్యాదు చేయడానికి వస్తూ ఉంటారని, అలా వచ్చిన వారికి మర్యాదపూర్వకంగా వారి సమస్యలను విని సత్వర న్యాయం అందిస్తామని భరోసా వారిలో కలిగించాలని సిబ్బందికి తెలియజేశారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ప్రజలు తమ ఫిర్యాదులను స్థానిక పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్-డివిజన్ కార్యాలయాలలో కూడా సమర్పించవచ్చని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళ పోలీస్ స్టేషన్ డిఎస్పీ వి.వి రమణ కుమార్, ఒంగోలు వన్ టౌన్ ఇన్స్పెక్టర్ నాగరాజు, అద్దంకి రూరల్ మల్లికార్జున రావు, కొండేపి సీఐ సోమశేఖర్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సై జనార్దన్ రావు, ప్యానల్ అడ్వకేట్ బి. బాలాజీ సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

# 6 మంది పిల్లల దత్తత



**కలెక్టరేట్ ఒంగోలు , పెన్ పవర్ మార్చి 09**

ప్రకాశం జిల్లా కలెక్టర్ పి రాజబాబు అధ్యక్షతన 6 మంది పిల్లలను దత్తత ఇవ్వడం జరిగింది. కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన దంపతులు సోమవారం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా దత్తత ప్రక్రియ స్వీకరించడం జరిగింది. వీరందరూ కుడా పొలిసు శాఖ, బ్యాంకు, సాఫ్ట్వేర్, బిజినెస్ రంగాల్లో స్థిరపడియున్నారు. జిల్లా కలెక్టర్ పేరెంట్స్ తో మాట్లాడుతూ ఈ పిల్లలు మీకు దేవుడు ఇచ్చిన వరం అని, ఈ పిల్లలను మీ కడుపున పుట్టిన బిడ్డలగా భావించి వారికి మంచి భవిష్యత్తు ఇవ్వాలని సూచించారు. తల్లిదండ్రులకు దత్తత ఆర్డర్స్ ను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి యం. నాగమణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి పి. దినేష్ కుమార్, చైల్డ్ వెల్ఫేర్ సభ్యురాలు డి. నీలిమ వంశి లత, శిశుగృహ సిబ్బంది పాల్గొన్నారు.

# మిస్సింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక దృష్టి సారించాలి

## - ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్





**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి09**

మిస్సింగ్ కేసులు, ఎన్బి డబ్ల్యులు, మహిళలకు సంబంధించిన కేసులు, రోడ్డు ప్రమాదాల నివారణ, అలాగే స్వర్ణాంధ్ర విజన్ కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ వంటి అంశాలపై సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై పోలీస్ అధికారులను ఆరా తీసి, తగిన సూచనలు, సలహాలు తెలియజేశారు. మిస్సింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఏవరైన తప్పిపోయారని లేదా కనిపించుటలేదని ఫిర్యాదు వచ్చినప్పుడు ఆ వ్యక్తి ఫోటోని అన్ని పోలిస్టేషన్లకు పంపించి ట్రేస్ చేయుటకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేయాలని, మిస్సింగ్ కేసులను మతిస్థిమితం లేని వ్యక్తులు, చిన్నారులు, వృద్ధులు, బాలికలు, యువతులు, మహిళలు, పురుషులు కేటగిరులుగా విభజించి అదృశ్యమైన వారి ఆచూకీ కనుగొనడంలో అధునాతన విధానాలు అనుసరించాలని, మిస్సింగ్ కేసులలో ఎంత వేగంగా విచారణ మొదలుపెడితే అంత తొందరగా ట్రేస్ చెయ్యగలమని, కావున మిస్సింగ్ కేసుల్లో అలసత్వం వహించవద్దని జిల్లా ఎస్పీ అన్నారు. అదేవిధంగా నాన్‌బెయిలబుల్ వారెంట్లు (ఎన్ బి డబ్ల్యు) ఎటువంటి పెండింగ్ లేకుండా త్వరితగతిన అమలు చేయాలని, ముఖ్యంగా చెడు నడత కలిగిన నేరస్తులపై జారీ అయిన ఎన్ బి డబ్ల్యు లను ప్రాధాన్యతగా తీసుకుని వేగంగా ఎగ్జిక్యూట్ చేయాలని, సమన్స్‌లను సంబంధిత వ్యక్తులకు సకాలంలో సర్వ్ చేయాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. మహిళకు సంబంధించిన కేసులలో త్వరగా స్పందించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని,అదే విధంగా యాక్సిడెంట్ అయిన వెంటనే పోలీసు వారితో, ఇతర సంబంధిత శాఖ అధికారులు యాక్సిడెంట్ ప్రదేశమును సందర్శించి ఐఆర్ఏడి యాప్ ద్వారా పూర్తి వివరాలను అప్లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా వాటికి సంబంధించిన డేటాను కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ లో సక్రమంగా పొందుపరచి, కేసుల పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ వేగవంతంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసులో తాజా సమాచారం సమయానికి అప్‌డేట్ పొందుపరచాలన్నారు. ఈ సమావేశంలో డిసిఆర్బి ఇన్స్పెక్టర్ దేవప్రభాకర్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్సైలు పాల్గొన్నారు.

# అద్దంకిలో ఘరానా మోసం

**కుదవబెట్టిన బంగారం స్వాహా**

**వ్యాపారి మోసంపై**

**ఒంగోలు కలెక్టరేట్ వద్ద ఎస్టీ మహిళల ఆందోళన**



**అద్దంకి(ఆర్సి ఇంచార్జి) పెన్ పవర్, మార్చి 9**

బంగారం తాకట్టు పెట్టుకుని డబ్బులు ఇచ్చి, ఆ తర్వాత తమ బంగారాన్ని ఇవ్వకుండా ఒక వ్యాపారి మోసం చేశాడని ఆరోపిస్తూ అద్దంకి పట్టణానికి చెందిన ఎస్టీ మహిళలు సోమవారం ఒంగోలు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. నిరసన అనంతరం పీజీఆర్ఎస్ విభాగంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి తమకు న్యాయం చేయాలని రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

**అసలేం జరిగిందంటే...:** అద్దంకి పట్టణం 7వ వార్డు ఏకలవ్య నగర్‌కు చెందిన ఎస్టీ (ఎరుకుల) కులానికి చెందిన మహిళలు.. స్థానిక చిల్లర వ్యాపారి నూకల రామాంజనేయులు వద్ద తమ బంగారాన్ని తాకట్టు పెట్టి నగదు తీసుకున్నారు. అయితే, ఆ తర్వాత తమ బంగారం విషయంలో సదరు వ్యాపారి మోసానికి పాల్పడటమే కాకుండా, ప్రశ్నించినందుకు "మీకు దిక్కున్న చోట చెప్పుకోండి" అంటూ బెదిరింపులకు గురిచేస్తున్నాడని బాధితులు వాపోయారు. వ్యాపారి వేధింపులు తాళలేక కలెక్టర్‌ను ఆశ్రయించినట్లు వారు తెలిపారు. బాధితులకు మద్దతుగా కేవీపీఎస్ ప్రకాశం జిల్లా కార్యదర్శి బొమ్మతోటి రఘురామ్ ఈ ఆందోళనలో పాల్గొన్నారు. బాధితులతో కలిసి ఆయన కలెక్టర్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా రఘురామ్ మాట్లాడుతూ.. ఎస్టీ మహిళలను నమ్మించి వారి వద్ద నుంచి బంగారం తీసుకుని మోసం చేయడం తీవ్రమైన అన్యాయమని మండిపడ్డారు. నిరుపేదలైన బాధితులను ఎదురు బెదిరించడం దుర్మార్గమైన చర్య అని ఖండించారు. నిందితుడైన వ్యాపారిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. ?కలెక్టర్‌ను కలిసే ముందు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద బాధితులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బాధితులు దాసరి అంజమ్మ, దాసరి మంగమ్మ, శ్రీరాం వెంకటమ్మ, శ్రీరాం అంజమ్మ, జగన్నాథం అంజమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే



**కందుకూరు పెన్ పవర్ మార్చి 9**

ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ పరీక్షలలలో కందుకూరు పట్టణంలో గల శ్రీ చైతన్య టెక్నో పాఠశాల విద్యార్థులు అత్యధిక ప్రతిభ కనబరిచారు. వారిలో గ్రాండ్ ప్రైజ్ పొందిన విద్యార్థిని 6వ తరగతి చదువుతున్న సోమవరపు శ్రీ జోషిత ల్యాప్ టాప్ ను పొందడం జరిగింది. మొదటి బహుమతి 3వ తరగతి చదువుతున్న గ్రీష్మ ట్యాబు ను పొందడం జరిగినది.ఐ ఎన్ టి ఎస్ ఓ లో ప్రతిభ కనపరిచిన టువంటి విద్యార్థులకు స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదగా విద్యార్థులకు బహుమతులు అందజేసి వారికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి సురేష్ ఏజీఎం అంజయ్య ఆర్ ఐ అనిల్ కుమార్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు డీన్ బ్రహ్మయ్య సి బ్యాచ్ ఇంచార్జ్ శివయ్య ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఉత్తమ సేవా పురస్కార గ్రహీతలకు సన్మానం





**కందుకూరు పెన్ పవర్, మార్చి 9**

గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్లస్టర్ సీఆర్ఎం టీచర్ గా విధులు నిర్వహిస్తున్న ఎం.వి. రమణారెడ్డి, అలాగే డ్రాయింగ్ టీచర్ ఎం. వెంకటేశ్వర్లు జిల్లా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది సోమవారం ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎం. నరసింహమూర్తి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలను ఎప్పటికప్పుడు పాటిస్తూ విధులు నిర్వహించడతో పాటుగా వృత్తి పట్ల నిబద్ధత పనిచేసి మన పాఠశాల నుంచి ఒకేసారి ఇద్దరు ఉపాధ్యాయులు జిల్లా స్థాయిలో ఉత్తమ సేవా అవార్డులను అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు సన్మాన గ్రహీతల సేవలను కొనియాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలను ఎప్పటికప్పుడు పాటిస్తూ విధులు నిర్వహించారని కొనియాడారు. భవిష్యత్తులో కూడా విధి నిర్వహణ పట్ల అంకిత భావంతో పనిచేసి మరెన్నో అవార్డులు సాధించాలని ఆకాక్షించారు. సన్మాన గ్రహీత సీఆర్ఎంటీ రమణారెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా తమ పనితీరును గుర్తించి గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ సీఆర్ఎం టీచర్ అవార్డు అందుకోవడం తమకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. విద్యారంగంలో తాను చేసిన సేవలకు ఈ గుర్తింపు లభించిందన్నారు. జిల్లా ఉత్తమ సేవా పురస్కారం దక్కడం బాధ్యతను మరింత పెంచిందన్నారు. మరో సన్మాన గ్రహీత ఎం. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపిక కావడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. అవార్డు రావడానికి సిఫార్సు చేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఘనంగా ఆత్మీయ సన్మానం నిర్వహించి, అభినందనలు తెలిపిన హెచ్‌ఎం, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు, పాఠశాల ఉపాధ్యాయేతర సిబ్బందికి సన్మాన గ్రహీతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

# నారాయణస్వామి ఆదివారం ఆదాయం రూ 1,40,826/-

**సి ఎస్ పురం, పెన్ పవర్ మార్చి 9**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణ స్వామికి ఆదివారం ఆదాయం 1లక్ష 40 వేల 826 రూపాయలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు దర్శనం టికెట్లు అమ్మకం ద్వారా జమ రూ.53,850/-లు, లడ్డు ప్రసాదం అమ్మకం వలన జమ రూ.30,500/- లు, శాశ్వత అన్నదానమునకు విరాళంలు రూ. 23,380/- లు, స్వామివారి పంచామృత అభిషేకమునకు రూ.33,096/- లు వచ్చినట్లు తెలిపారు.

# కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు పెన్ పవర్ మార్చి 9**

ప్రకాశం కలెక్టర్ రాజాబాబుని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం మర్యాద పూర్వంగా కలిశారు. కందుకూరు నియోజకవర్గంలో సమస్యలు, వాటిపరిష్కారాలపై సుదీర్ఘంగా చర్చించారు.

# రాజోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారం...

**రాజోలు, పెన్ పవర్, మార్చి 9**

అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాజోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. రాజోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా టీడీపీ పార్టీ నుంచి కేతా వెంకటలక్ష్మి ని నియమించారు. చైర్మన్, కమిటీ డైరెక్టర్ల చేత టిడిపి పొలిటి బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రమణ్యం ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్య అతిథిలుగా రాష్ట్రమంత్రి వాసంశెట్టి సుభాష్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, టిడిపి ఇంచార్జ్ గొల్లపల్లి అమూల్య

కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ, పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యతను ఇస్తామని, పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడుతున్నందు వెంకటలక్ష్మికి రాజోలు మార్కెట్ కమిటీ చైర్మన్ బాధ్యతలు అప్పగించామని ఎమ్మెల్యే తెలియజేశారు. చైర్మన్ గా ఎన్నికైన వెంకటలక్ష్మి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆమె తెలియజేశారు. బిసి మహిళ కు మార్కెట్ కమిటీ చైర్మన్ గా నేను రైతులందరికీ అన్ని రకాల సౌకర్యాలు కల్పించి రైతుకు ఇప్పుడు అండదండగా ఉంటానని ఆమె తెలియజేశారు. ఏ ఎమ్ సి చైర్మన్ గా అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు పవన్ కళ్యాణ్, లోకేష్, లోకల్ రధసారధి రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కి కూటమి నేతలకు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు.




# శ్రీ సంస్కృతి స్కూల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**కందుకూరు పెన్ పవర్, మార్చి 9**


పట్టణం గుర్రం వారి పాలెం లోని శ్రీ సంస్కృతి స్కూల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని "మహిళా సాధికారత-దేశాభివృద్ధి" అనే నినాదంతో వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళల గొప్పతనాన్ని తెలిపేలా నృత్య రూపకాలు,నాటికలు మరియు గీతాలను ఆలపించారు. ముఖ్యంగా "నారీ శక్తి "థీమ్ తో చేసిన ప్రదర్శన అందరిని ఆకట్టుకున్నది. ఈ సందర్భంగా పాఠశాలలో ఉత్తమ సేవలందించిన మహిళా ఉపాధ్యాయులను సిబ్బందిని యాజమాన్యం ఘనంగా సన్మానించింది.ఈ సందర్భంగా చైర్మన్ కొంకా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఒక పురుషుడు చదువుకుంటే ఒక వ్యక్తి మాత్రమే అభివృద్ధి చెందుతాడు కానీ ఒక మహిళ చదువుకుంటే మొత్తం కుటుంబమే విజ్ఞానవంతం అవుతుంది అన్నారు. సంస్కృతి పాఠశాలలో విద్యార్థులను కేవలం విద్యార్థులుగా కాకుండా, రేపటి తరం నాయకురాళ్ళుగా తీర్చిదిద్దుతున్నామని తెలియపరిచి అహర్నిశలు శ్రమిస్తున్నమహిళ ఉపాధ్యాయులను సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరి, వైస్ ప్రిన్సిపాల్ శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 14వ సంవత్సరం లో అడుగుపెట్టిన బాలికలకు హెచ్ పి వి వాక్సినేషన్ వేయించాలి

## జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

**విశాఖపట్నం, పెన్ పవర్, మార్చి 9**

14వ సంవత్సరంలో అడుగు పెట్టిన బాలికలందరకు సమీపంలో గల ఆరోగ్య కేంద్రాలలో హెచ్పివి వాక్సిన్ వేయించి గర్భాశయ ముఖ ద్వార కాన్సర్ బారిన పడకుండా చూడాలని జిల్లా కలక్టరు ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ కోరారు. సోమవారం కలక్టరేట్ లో జరిగిన సమావేశం లో గర్భాశయముఖ ద్వార కాన్సర్ వాక్సిన్ నిర్వాహన పై తగు సూచనలు చేశారు. వాక్షినేషన్ తీసుకునే వారు ఆహారం తీసుకున్న తరువాత మాత్రమే వాక్సినేషన్ వేయించుకోవాలని అన్నారు. ఎవరైనా ఉదయం ఆహరం తీసుకోకుండా వాక్షినేషన్ కేంద్రానికి వస్తే ఆహారం తిని రావాలని లేదా కేంద్రం వద్ద కొంత ఆహరం ఏర్పాటు చేయాలని, వాక్షినేషన్ అయిన తరువాత 30 నిముషాలు అబ్జర్వేషన్ లో ఉంచాలన్నారు. జిల్లాలో కౌమార దశలో ఉన్న 17,743 మంది ఆడ పిల్లలను గుర్తించారని, 14వ సంవత్సరంలోకి అడుగుపెట్టి 15వ సంవత్సరములోనికి రాకముందే జిల్లాలో గుర్తించిన 33 కేంద్రాలలో ఒక రోజు హెచ్పివి వాక్సిన్ ఉచితంగా వేస్తారన్నారు. ఇప్పటి నుండి 3 నెలల వరకు ఈ వాక్సిన్ కేంద్రాలలో అందుబాటులో ఉంటుందన్నారు. ఏఎన్‌ఎంలు, నర్సులు వాక్సినేషన్ వేస్తారని, ఆషా, అంగన్వాడీ వర్కర్లు 14 సంవత్సరములు ఆడపిల్లలకు అవగాహన కల్పించి కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విద్యాదరి, జిల్లా ఇమ్యూన్లై?జెషన్ అధికారి డా. డిప్యూటీ డిఎమ్‌హెచ్ఓ డా. రమేష్ లూసి కార్డిలియాపాల్గొన్నారు.



## మేము కెన్యా, ఉగాండాను మాత్రమే ఓడించాం.. భారత్ పై గెలవలేమన్న పాక్ మాజీ క్రికెటర్



**హైదరాబాద్ పెన్ పవర్:** 2026 టీ20 వరల్డ్ కప్ ఫైనల్లో భారత్ ఘన విజయం సాధించిన తర్వాత దేశవ్యాప్తంగా సంబరాలు కొనసాగుతుండగా, పాకిస్తాన్‌లో మాత్రం ఈ గెలుపు తీవ్ర చర్చకు దారితీసింది. న్యూజిలాండ్‌పై 96 పరుగుల తేడాతో భారత్ గెలవడంపై పాకిస్తాన్ మాజీ క్రికెటర్ అహ్మద్ షెహ్జాద్ తమ దేశ క్రికెట్ వ్యవస్థపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "హార్నా మానా హై" కార్యక్రమంలో మాట్లాడిన షెహ్జాద్.. భారత్ విజయానికి కారణం వారి బలమైన క్రికెట్ వ్యవస్థ.. టీమిండియాలో ప్రతిభతో పాటు సరైన సిస్టమ్ ఉండటంతో కొత్త ఆటగాళ్లు ముందుకు వస్తున్నారని చెప్పారు. కానీ పాకిస్తాన్‌లో ప్రతిభకు కొరత లేదు.. మా సిస్టమ్‌లోనే సమస్య ఉందన్నారు.

**భారత ఆటగాళ్లపై ప్రశంసలు:**
సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ వంటి ఆటగాళ్లను అహ్మద్ షెహ్జాద్ ఉదాహరణగా చూపించాడు. టోర్నీలో పెద్దగా అవకాశాలు రాకపోయినా, వచ్చిన ఛాన్స్ ని వారు అద్భుతంగా ఉపయోగించుకున్నారని తెలిపాడు. శాంసన్ ఈ టోర్నీలో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ గా నిలవడం చాలా గొప్ప విషయం అన్నారు. అలాగే ఫైనల్లో ఒత్తిడిని జయించి అభిషేక్ శర్మ అద్భుతంగా ఆడాడని అతడు ప్రశంసించారు. కేవలం 21 బంతుల్లో 52 పరుగులు చేసి మ్యాచ్ స్వరూపన్నే మార్చేశాడని పేర్కొన్నాడు.

**పాక్ క్రికెట్‌పై వ్యంగ్యం:**
భారత్ జట్టు పెద్ద జట్లతో సిరీస్‌లు ఆడుతూ మెరుగవుతుంటే, పాకిస్తాన్ మాత్రం జింబాబ్వే, కెన్యా, ఉగాండా వంటి జట్లపై గెలిచినప్పుడే ఎక్కువగా సంబరాలు చేసుకుంటుందని అహ్మద్ షెహ్జాద్ విమర్శలు గుప్పించాడు. భారత్ 250 పరుగుల లక్ష్యంతో ఆడుతుంది, కానీ పాకిస్తాన్ అయితే 180 పరుగులు చేస్తే సరిపోతుందని భావించి బౌలర్లపై ఆధారపడుతుందని చెప్పుకొచ్చాడు. అంతేకాకుండా, న్యూజిలాండ్ చివర్లో అడ్డుకోకపోయింటే.. భారత్ స్కోరు 275 వరకు వెళ్లే ఛాన్స్ ఉండేదని తెలిపారు. పాకిస్తాన్‌కు ఒక ప్రత్యేక ర్యాంకింగ్ పెట్టాలి.. అందులో కేవలం కెన్యా, ఉగాండా, జింబాబ్వే లాంటి జట్లే ఉండాలంటూ మాజీ క్రికెటర్ అహ్మద్ షెహ్జాద్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు.

## నీళ్లు తాగించాలి, బ్యాట్ అందివ్వడమే మా పని.. టీమ్ మేనేజ్మెంట్‌పై సిరాజ్ సెటైర్లు





**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా తరఫున ఆడే హైదరాబాద్ స్టార్ క్రికెటర్, పేసర్ మహమ్మద్ సిరాజ్ తన హాస్యంతో కూడిన సమాధానాలతో ఎప్పుడూ అభిమానులను ఆకట్టుకుంటుంటాడు. తాజాగా టీ20 వరల్డ్ కప్ 2026 విజేతల జట్టులో సభ్యుడైన సిరాజ్ ఇచ్చిన ఒక ఫన్నీ సమాధానం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఒక ఇంటర్వ్యూలో సిరాజ్‌ను జట్టు విజయంలో తనతో పాటు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ పాత్ర గురించి ప్రశ్నించారు. దీనికి సిరాజ్ సరదాగా స్పందిస్తూ నవ్వులు పూయించాడు.

**మా పని నీళ్లు పెట్టడం, బ్యాట్ అందివ్వడమే:**
ప్రెజెంటర్ మాట్లాడుతూ.. ప్లేయింగ్ ఎలెవెన్‌లో లేకపోవడం కొంత నిరాశ కలిగించవచ్చు కానీ మీ ఇద్దరి పాత్ర ఎంత ముఖ్యమని డీఎస్పీని అడిగాడు.. దీనికి సిరాజ్ సరదాగా స్పందిస్తూ.. మా పాత్ర చాలా పెద్దది.. బయట కూర్చుని ఆటగాళ్లకు వరుసగా నీళ్లు పెట్టడం, వారికి బ్యాట్లు అందజేయడం, నెట్స్ లో ప్రాక్టీస్ చేసే సమయంలో బౌలింగ్ చేయడమే మా పని అని చెప్పాడు. ఈ సమాధానం చెప్పిన వెంటనే సిరాజ్ కూడా నవ్వుకున్నాడు.

**ఈ విజయం టీమ్ క్రెడిట్ వల్లే:**
సిరాజ్ మాట్లాడుతూ.. ఈ విజయం మొత్తం క్రెడిట్ టీంకే చెందుతుందని చెప్పాడు. జట్టు ఏం నిర్ణయిస్తే అదే మంచిదని తాను నమ్ముతానని పేర్కొన్నాడు. నెట్‌లో బౌలింగ్ చేస్తాం.. టీమ్‌లో పాజిటివ్ వాతావరణం ఉంచుతాం.. ప్రతి ఆటగాడికి ఆడాలని ఉంటుంది.. కానీ టీమ్ కాంబినేషన్ కోసం బయట కూర్చోవాల్సి వస్తే, జట్టు ప్రయోజనం ఏమైనా చేస్తామన్నారు. ఇక్కడ వ్యక్తి కాదు, టీమ్ ముఖ్యమైంది అని తెలిపాడు.

**ఇది దేవుడి స్క్రిప్ట్:**
మరో ప్రశ్నకు సమాధానంగా సిరాజ్ మాట్లాడుతూ.. మొదట తాను జట్టులో లేకపోయినా తర్వాత అకస్మాత్తుగా పిలుపు వచ్చిందని చెప్పారు. ఇది దేవుడి స్క్రిప్ట్.. చివరకు మేము ఛాంపియన్స్ అయ్యామని సిరాజ్ అన్నారు.

## ఐపీఎల్ తర్వాత టీమిండియా షెడ్యూల్.. 2027 ప్రపంచకప్ వరకు ఫుల్ బిజీ




**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్ 2026 గెలిచిన తర్వాత మరోసారి చరిత్ర సృష్టించిన భారత జట్టు ఇప్పుడు కొంత విరామం తీసుకోనుంది. స్వదేశంలో జరిగిన ఈ టోర్నీలో టైటిల్‌ను కాపాడుకున్న టీమిండియా వరుసగా మూడోసారి ట్రోఫీని కైవసం చేసుకుంది. అయితే ఇప్పుడు ప్లేయర్స్ అందరూ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (IPL) 2026 సీజన్‌పై నజర్ పెట్టారు. ఈ టోర్నీ మార్చి 28వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఐపీఎల్ ముగిసిన తర్వాత జూన్ నుంచి ఇండియన్ టీమ్ మళ్లీ అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లతో మళ్లీ బిజీ షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఇకపై టీమిండియా దృష్టి ప్రధానంగా 2027 వన్డే వరల్డ్ కప్ పై పడింది. దాంతో పాటు వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (WTC) 2025--27 ఫైనల్ కి చేరుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంది.

**అఫ్ఘనిస్తాన్‌తో తొలి సిరీస్:**
ఐపీఎల్ తర్వాత జూన్‌లో భారత్--అఫ్ఘనిస్తాన్‌తో ఒక టెస్ట్-- మూడు వన్డేలు ఆడనుంది. ఆ తర్వాత ఇంగ్లాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్ లాంటి జట్లతో వరుసగా సిరీస్‌లు కొనసాగుతాయి. భారత్‌కు 2026--27 కాలంలో కొన్ని కీలక టోర్నీలు ఉన్నాయి. ముఖ్యంగా న్యూజిలాండ్ టూర్, బోర్డర్--గవాస్కర్ ట్రోఫీ (ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్) అనంతరం ఆసియా కప్ టోర్నమెంట్ కీలకంగా మారనుంది.

**టీమిండియా షెడ్యూల్:**

**భారత్ లో ఆఫ్ఘనిస్తాన్ టూర్**
మ్యాచ్‌లు: 1 టెస్ట్, 3 వన్డేలు
తేదీలు: జూన్ 6 -- జూన్ 20, 2026
వేదిక: భారత్

**ఇంగ్లాండ్ లో భారత్ పర్యటన:**
మ్యాచ్‌లు: 5 టీ20లు, 3 వన్డేలు
తేదీలు: జూలై 1 -- జూలై 19, 2026

**ఇండియా టూర్ ఆఫ్ శ్రీలంక:**
మ్యాచ్‌లు: 2 టెస్టులు, 2 టీ20లు
తేదీలు: ఆగస్టు 2026

**ఇండియా టూర్ ఆఫ్ బంగ్లాదేశ్**
మ్యాచ్‌లు: 3 వన్డేలు, 3 టీ20లు
తేదీలు: సెప్టెంబర్ 1 -- సెప్టెంబర్ 13, 2026

**ఇండియా టూర్ ఆఫ్ ఆఫ్ఘనిస్తాన్:**
మ్యాచ్‌లు: 3 టీ20లు
తేదీలు: సెప్టెంబర్ 2026

**ఏషియన్ గేమ్స్ 2026:**
ఫార్మాట్: టీ20
తేదీలు: సెప్టెంబర్ 19 - అక్టోబర్ 4
వేదిక: జపాన్

**వెస్టిండీస్ టూర్ ఆఫ్ ఇండియా:**
మ్యాచ్‌లు: 3 వన్డేలు, 3 టీ20లు
తేదీలు: అక్టోబర్ 2026
వేదిక: భారత్

**ఇండియా టూర్ ఆఫ్ న్యూజిలాండ్:**
మ్యాచ్‌లు: 2 టెస్టులు, 3 వన్డేలు, 5 టీ20లు
తేదీలు: అక్టోబర్ -- నవంబర్ 2026
వేదిక: న్యూజిలాండ్


**శ్రీలంక టూర్ ఆఫ్ ఇండియా:**
మ్యాచ్‌లు: 3 వన్డేలు, 3 టీ20లు
తేదీలు: డిసెంబర్ 2026 -- జనవరి 2027
వేదిక: భారత్

**బోర్డర్--గవాస్కర్ ట్రోఫీ (ఇండియా వ ఆస్ట్రేలియా)**
మ్యాచ్‌లు: 5 టెస్టులు
తేదీలు: జనవరి -- ఫిబ్రవరి 2027
వేదిక: భారత్

**కీలక టోర్నీలు**
వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ - జూన్ 2027 (అర్హత సాధిస్తే)
ఆసియా కప్ 2027 (వన్డే ఫార్మాట్) - జూలై 2027, బంగ్లాదేశ్
క్రికెట్ వరల్డ్ కప్ 2027 - అక్టోబర్-నవంబర్ 2027, దక్షిణాఫ్రికా/జింబాబ్వే/నమీబియా

# సమ్మర్ వేళ హీట్ పుట్టిస్తున్న ప్రభాస్ బ్యూటీ!







సీజన్ కి తగ్గట్టుగా ఫాలోవర్స్ ను పెంచుకోవడానికి అటు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ మరింత క్రేజ్ దక్కించుకుంటున్నారు సెలబ్రిటీలు. ముఖ్యంగా అకౌంట్ ఉంటే చాలు తమ అందాలు ఆరబోస్తూ.. అటు దర్శక నిర్మాతల కంట్లో కూడా పడుతున్నారని చెప్పాలి. ఈ క్రమంలోనే ఎంతోమంది హీరోయిన్స్ సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటూ గ్లామర్ వలకబోస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు . పైగా పబ్లిక్ ఈవెంట్లలో, సినిమా ఫంక్షన్లలో సందడి చేసిన ఈ ముద్దుగుమ్మలు. అందుకు సంబంధించిన ఫోటోలను తాజాగా తమ ఇన్స్టాగ్రామ్ ఖాతాల ద్వారా షేర్ చేస్తూ అభిమానులకు మంచి అందాల ట్రీట్ ఇస్తున్నారని చెప్పాలి.

ఇదిలా ఉండగా తాజాగా ప్రభాస్ బ్యూటీగా పేరు దక్కించుకున్న రిద్ధీ కుమార్.. ఇన్స్టాగ్రామ్ వేదికగా పంచుకున్న కొన్ని ఫోటోలు సోషల్ మీడియాలో మరింత వైరల్ గా మారుతున్నాయి. హెవీ ఎంబ్రాయిడరీ తో డిజైన్ చేసిన స్లీవ్ లెస్ లెహంగా ధరించిన ఈమె.. ముత్యాలతో అద్భుతంగా రూపొందించిన ఈ డ్రెస్. తన మేనిఛాయతో అందాలు ఒలకబోస్తూ ప్రేక్షకులను మరింత మెస్మరైజ్ చేస్తోంది. ముఖ్యంగా నెక్ ను గ్రీన్ కలర్ స్టోన్ చైన్ తో ఫుల్ ఫిల్ చేసింది. మొత్తానికైతే రిద్ధీ కుమార్ సోషల్ మీడియా వేదికగా షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాని షేక్ చేస్తోంది అనడంలో సందేహం లేదు. తన అందాలతో ఉక్కిరిబిక్కిరి చేస్తూ సమ్మర్ వేళ మరింత హీట్ పుట్టిస్తుంది అని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ఇకపోతే తాజాగా నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఒక ఈవెంట్ కి హాజరైన ఈమె. అక్కడ వివిధ రంగాలలో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి అవార్డులు అందుకున్న మహిళలను కలిసినందుకు తాను ఎంతో గర్వంగా ఫీల్ అవుతున్నాను అంటూ క్యాప్షన్ గా రాసుకొచ్చింది. ఇక ప్రస్తుతం రిద్ధీ కుమార్ షేర్ చేసిన ఈ ఫోటోలు, ఇచ్చిన క్యాప్షన్ సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. మహారాష్ట్రలోని షిర్డి సమీపంలో ఉన్న కోపర్గావ్ ప్రాంతంలో ఒక సైనిక కుటుంబంలో జన్మించింది. ఈమె తండ్రి భారత సైన్యంలో అధికారి కాగా, ఈమె పూణేలోని ఫెర్గ్యూసన్ కళాశాల నుండి తత్వశాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీ అందుకుంది. సినిమాలోకి రాకముందు మోడల్ గా పనిచేసిన ఈమె.. పలు ఫ్యాషన్ షోలు , ప్రాంతీయ అందాల పోటీల్లో పాల్గొనింది. 2018లో రాజ్ తరుణ్ సరసన లవర్ అనే చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈమె.. ఆ తర్వాత విరాజ్ అశ్విని సరసన అనగనగా ఓ ప్రేమ కథలో కనిపించింది.ఇకపోతే ప్రసిద్ధ క్యాడ్బరీ డైరీ మిల్క్ యాడ్ లో కూడా కనిపించిన రిద్ధి ఇటీవల ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో వచ్చిన ది రాజా సాబ్ సినిమాలో హీరోయిన్ గా నటించి ఆకట్టుకుంది. ఇందులో రిద్ధి తో పాటు నిధి అగర్వాల్ , మాళవిక మోహనన్ కూడా నటించిన విషయం తెలిసిందే. అటు టెలివిజన్ సిరీస్ లలో కూడా నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది రిద్ధి కుమార్.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com